తెలుగు దినపత్రిక

# సిరి

People's Voice వార్త పత్రిక

RNI TG TEL/ 26/A0381

22-06-2026

సోమవారం హైదరాబాద్

సంపుటి: (volume):1

సంచిక: (ISSUE):134

PUBLISHED FROM HYDERABAD పేజీలు-8 వెల:రూ.4 /–



తెలుగు దినపత్రిక

www.siridaily.com

సిరి People's Voice వార్తపత్రిక

RNI:TGTEL/26/A0381

siridailynews@gmail.com

/siridailynews

@siridailynews

epaper.siridaily.com

విలేకరులు కావలెను

ఉన్నత ఆశయంతో ముందుకు పోతున్న సిరి దినపత్రిక లో తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలకు స్టాఫ్ రిపోర్టర్స్ తో పాటు, అన్ని జిల్లాలోని నియోజకవర్గ కేంద్రాలకు మరియు మండలాలకు విలేకరులు కావలెను.

99897 78881, 7702344303, 9440451575




## విద్యుత్ ఉద్యోగులకు

# డిజిటల్ అటెండెన్స్ !

**టీజీఎన్పీడీసీఎల్ లో నేటినుండి అమలు !**

**క్షేత్ర స్థాయి సిబ్బంది నుండి అధికారుల వరకు!**

- యాప్ లో నమోదు తప్పనిసరి!
- ఇక ఉద్యోగుల హాజరు కార్పొరేట్ స్థాయిలో పర్యవేక్షణ !
- పనితీరు మెరుగు పరిచేందుకే కొత్త విధానం !
- ప్రమాదాల నివారణకు ఉద్యోగుల హాజరుపై ద్రుష్టి సారించిన సీఎండీ వరుణ్ రెడ్డి

**తెలంగాణ బ్యూరో సిరి న్యూస్:** తెలంగాణ పరిధిలో వరంగల్ కేంద్రంగా నడుస్తున్న టీజీఎన్పీడీసీఎల్ లో విద్యుత్ ఉద్యోగుల హాజరుపై యాజమాన్యం ద్రుష్టి సారించింది. ఇది వరకు సర్కిల్, డివిజన్,సెక్షన్ కార్యాలయాల్లో పనిచేసే అధికారులకు మాత్రమే అక్కడ రిజిస్టర్ లో హాజరు నమోదు చేయాల్సి వచ్చేది. కానీ కొత్తగా టెక్నాలజీ ద్వారా తెస్తున్న విధానం మూలంగా ఆపరేషన్ పరిధిలోని ఎస్ఈ స్థాయినుండి క్షేత్ర స్థాయిలో ఉండే జెఎల్ఎమ్ వరకు వ్యక్తిగత హాజరు ఎంప్లాయ్ పోర్టల్ లో నమోదు చేయాల్సిందే. ఈ మేరకు నేటి నుండి టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో కొత్త యాప్ ద్వారా హాజరు ఎవరికీ వారే నమోదు చేసుకునేలా డిజిటల్ సెల్ఫ్ అటెండెన్స్ విధానాన్ని తీసుకువచ్చారు.

(మిగతా 2లో)

## హైడ్రాలు, బుల్డోజర్లు

# పేదోళ్ల ఇళ్లపైకేనా.....?

- హనుమాన్ నగర్ ప్రజలకు కేటీఆర్ భరోసా
- పెద్దల అక్రమాలపై చర్యలేవని ప్రశ్న
- పేదల ఇళ్లు కూల్చడం ప్రభుత్వ పని కాదన్న కేటీఆర్
- నోటీసులు ఇస్తే న్యాయపోరాటం చేస్తామని హామీ
- 2028లో కేసీఆర్ వచ్చి ఇళ్ల పట్టాలు ఇస్తారని వ్యాఖ్య



**రాజేంద్రనగర్ (సిరి న్యూస్) :**

హైడ్రా లు, బుల్డోజర్లు పేదల ఇళ్లపైకే వస్తాయా... పెద్దోళ్ల ఇళ్లపైకి వెళ్లవా.. అంటు బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షులు కేటీఆర్ ప్రశ్నించారు. యాభై సంవత్సరాలుగా నివాసాలు ఏర్పరుచుకుని జీవనం సాగిస్తున్న రాజేంద్రనగర్ హనుమాన్ నగర్ లోని 350 కి పైగా నివాసాలలో ఉంటున్న వారిని ఖాళీ చేయాలని ప్రభుత్వం చెబుతుండటంతో ఆదివారం కేటీఆర్ హనుమాన్ నగర్ ప్రజలతో సమావేశమై వారికి భరోసా కల్పించి ధైర్యం చెప్పారు. ప్రభుత్వం ఉంది పేదోళ్లకు కొత్త ఇండ్లు కట్టించి ఇవ్వడానికి గానీ, కూల్చడానికి కాదని తెలిపారు. హైడ్రాలు, బుల్డోజర్లు హనుమాన్ నగర్ లో ఉండే పేదోళ్ల ఇళ్లపైకే వస్తాయా... దుర్గం చెరువు తలాబ్ లో ఇళ్లు కట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్న ఇంటికి వెళ్లవా.. రేవంత్ రెడ్డి తమ గ్రామంలో కట్టుకున్న రెడ్డి కుంట ఇంటికి వెళ్లవా.. అంతెందుకు హిమాయత్ సాగర్ జలాశయంలో ఫామ్ హౌజ్ లు, ఇండ్లు కట్టుకున్న మంత్రి వివేక్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఇళ్లపైకి వెళ్లవా.. అని ప్రశ్నించారు. హనుమాన్ నగర్ వాసులు ఐఖ్యంగా ఉండి ఒక్క సంవత్సరం తమ ఇళ్లను కాపాడుకోవాలని, మీ వెంట కార్తీక్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, మేమంతా ఉంటామన్నారు. సంవత్సరం తర్వాత 2028 చివరలో రాష్ట్రంలో ఎన్నికలు వస్తాయని, అప్పుడు ముఖ్యమంత్రిగా మీరందరు కోరుకుంటున్న

(మిగతా 2లో)

### గాంధీ పేరు చెప్పి పేదల ఇండ్లు కూల్చొద్దు : కేటీఆర్

- మూసీ పేరుతో విధ్వంస రాజకీయాలు చేస్తున్నారన్న కేటీఆర్
- గాంధీపై ప్రేమ ఉంటే పేదల ఇళ్లు కాపాడాలని సూచన
- కాంగ్రెస్ ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శ
- ప్రకాష్ గౌడ్ అభివృద్ధిలో విఫలమయ్యారని ఆరోపణ
- కేసీఆర్‌ను మళ్లీ సీఎం చేస్తామని బీఆర్ఎస్ ధీమా

2

# యోగా.. ఐక్యతకు మూలం: ప్రధాని మోదీ



అంతర్జాతీయ యోగా వేడుకల్లో ప్రధాని మోదీ

- పశ్చిమ బెంగాల్ సీఎం సువేందు అధికారితో కలిసి ప్రధాని యోగాసనాలు
- 20 ఏళ్లకంటే 40 ఏళ్ల వయసులో మరింత దృఢంగా ఉండాలని పిలుపు
- శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఉత్తమ మార్గమని వ్యాఖ్య
- ప్రపంచవ్యాప్తంగా యోగాను జీవనశైలిగా మార్చుకోవాలని పిలుపు

**(సిరి న్యూస్) కోల్‌కతా, :**

భూమిపై అత్యంత పొడవైన రోజైన జూన్ 21వ తేదీ యోగా పుణ్యమా అని ప్రపంచంలోనే అతిపెద్ద సామూహిక ఉత్సవ దినంగా మారిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల్లో భాగంగా ఆదివారం కోల్‌కతాలోని రెడ్ రోడ్ మైదానంలో నిర్వహించిన ప్రధాన జాతీయ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు.

ఈ కార్యక్రమంలో పశ్చిమ బెంగాల్ ప్రతిపక్ష నేత సువేందు అధికారి, కేంద్ర మంత్రులు మరియు వేలాది మంది యోగా సాధకులతో కలిసి ప్రధాని మోదీ కామన్ యోగా ప్రోటోకాల్ ప్రకారం యోగాసనాలు చేశారు. అనంతరం దేశ ప్రజలను ఉద్దేశించి ప్రసంగించారు.

ప్రధాని మాట్లాడుతూ యోగా అనేది కేవలం ఒక రోజు జరుపుకునే వేడుక కాదని, ప్రతి ఒక్కరి దైనందిన జీవితంలో భాగం కావాలని సూచించారు. ఈ ఏడాది అంతర్జాతీయ యోగా దినోత్సవ థీమ్ "ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా" అని గుర్తు చేశారు. వయసు పెరిగే కొద్దీ శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం, భావోద్వేగ సమతుల్యతను కాపాడుకోవడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. 20 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు కంటే 40 ఏళ్ల వయసులో మరింత దృఢంగా, 50 ఏళ్ల వయసులో మరింత శక్తివంతంగా ఉండేలా యోగా సహాయపడుతుందని చెప్పారు. యోగా కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదని, అది మానవ ఆత్మ యొక్క అత్యున్నత వ్యక్తీకరణ అని మోదీ అన్నారు. నిత్య యోగా సాధన ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత, ఒత్తిడి నియంత్రణ, స్వీయ అవగాహన పెరుగుతాయని తెలిపారు. ప్రపంచానికి మెరుగైన భవిష్యత్తును అందించేందుకు యోగా ఒక ముఖ్యమైన సాధనమని, ప్రతి ఒక్కరూ దాన్ని జీవన విధానంగా మార్చుకోవాలని ప్రధాని పిలుపునిచ్చారు.



## భారత సముద్రశక్తి మరింత బలోపేతం

- ఒకే రోజు మూడు యుద్ధనౌకలను జాతికి అంకితం చేసిన మోదీ
- స్వదేశీ సాంకేతికతతో తయారైన అత్యాధునిక నౌకలు
- ఐఎన్ఎస్ దుణగిరితో క్షిపణి దాడి సామర్థ్యం పెంపు
- సంశోధక్‌తో సముద్ర సర్వే, నావిగేషన్‌కు మరింత బలం
- అగ్రయ్‌తో జలాంతర్గాముల వేటలో భారత నేవీకి కొత్త శక్తి

2

## రాహుల్ గాంధీతో సమావేశం ఏర్పాటు చేయండి

- సీఎంకు బీజేపీ స్టేట్ చీఫ్ బహిరంగ లేఖ
- కాంగ్రెస్ గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలమైందన్న రాంచందర్ రావు
- ప్రజల సమస్యలు రాహుల్ గాంధీకి వివరించే అవకాశం కల్పించాలని డిమాండ్
- రైతులు, మహిళలు, యువతకు ఇచ్చిన హామీలు నెరవేరలేదని విమర్శ
- అపాయింట్‌మెంట్ ఇవ్వకపోతే ప్రజలకు ద్రోహం చేసినట్టేనని హెచ్చరిక
- సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాసిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు

2



## తెలంగాణ నుంచి రాజ్యసభ సీటు తీసుకోలేను

నాక్షి నటరాజన్

2



## ఉత్కంఠగా ముగిసిన

# నీట్-యూజీ..

**దేశవ్యాప్తంగా 22 లక్షల మంది విద్యార్థుల హాజరు**

- పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు
- మతపరమైన వస్తువుల తొలగింపుపై అభ్యంతరాలు
- ఆలస్యంగా వచ్చిన అభ్యర్థులకు అనుమతి నిరాకరణ
- ఫిజిక్స్ ప్రశ్నలు కఠినంగా ఉన్నాయని విద్యార్థుల అభిప్రాయం
- తనిఖీల్లో మత వస్తువుల తొలగింపుపై విద్యార్థులు, తల్లిదండ్రుల అభ్యంతరం
- ఆలస్యంగా వచ్చిన వారికి అనుమతి నిరాకరణ

న్యూఢిల్లీ (సిరి న్యూస్) : దేశవ్యాప్తంగా అత్యంత ఉత్కంఠ రేపిన నీట్‌యూజీ పరీక్ష ఆదివారం కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ముగిసింది. దేశంలోని వివిధ నగరాల్లో ఏర్పాటు చేసిన 5,440 కేంద్రాల్లో 22 లక్షలకు పైగా విద్యార్థులు ఈ పరీక్షకు హాజరయ్యారు. బయో మెట్రిక్ వెరిఫికేషన్, క్షుణ్ణంగా తనిఖీ చేయడం, ఏఐ ఆధారిత నిఘా, సీసీటీవీ కవరేజ్, సిగ్నల్ జామర్లు తదితర కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్ల నడుమ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) ఈ పరీక్షను నిర్వహించింది. పరీక్ష కేంద్రాల వద్ద తనిఖీల సమయంలో విద్యార్థులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

(మిగతా 2లో)

## అయోధ్యను వీడి వెళ్లొద్దు

ట్రస్ట్, ఆలయ సిబ్బందికి సిట్ ఆదేశాలు



## ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు దగ్ధం

**కరీంనగర్ -హైదరాబాద్ సూపర్ లగ్జరీ బస్సులో అగ్నిప్రమాదం**

- అలుగునూర్ శివారులో ప్రయాణికుల్లో భయాందోళన
- డ్రైవర్ అప్రమత్తతతో సురక్షితంగా బయటపడిన ప్రయాణికులు
- క్షణాల్లో వ్యాపించిన మంటలు, దట్టమైన పొగ
- అగ్నిప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభం

2





## మెలోనిపై మరోసారి మండిపడ్డ ట్రంప్

2

- ఇటలీ ప్రధాని పనితీరుపై ట్రంప్ తీవ్ర విమర్శలు
- ఇరాన్ అంశంలో అమెరికాకు మద్దతు లేదని ఆరోపణ
- ప్రజాదరణ కోసం స్నేహం నటిస్తున్నారని ట్రంప్ వ్యాఖ్యలు
- 'నా పాపులారిటీ గురించి మీకేం పని' అంటూ మెలోని కౌంటర్
- ఇద్దరు నేతల మాటల యుద్ధంతో దౌత్య వర్గాల్లో చర్చ

# రాహుల్ గాంధీతో సమావేశం ఏర్పాటు చేయండి: సీఎంకు బీజేపీ స్టేట్ చీఫ్ బహిరంగ లేఖ

(సిరి న్యూస్) తెలంగాణ బ్యూరో : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన గ్యారంటీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని, తెలంగాణ వ్యాప్తంగా ఉన్న వివిధ వర్గాల ప్రజల్లో తీవ్ర అసంతృప్తి, నిరాశ పెరుగుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పేర్కొన్నారు. ప్రజల ఆందోళనలను, సమస్యలను నేరుగా రాహుల్ గాంధీ దృష్టికి తీసుకెళ్లేందుకు వీలుగా, వీలైనంత త్వరగా ఆయనతో అపాయింట్‌మెంట్ కల్పించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఒకవేళ కాంగ్రెస్ నాయకత్వం స్పందించడంలో, అపాయింట్‌మెంట్ కల్పించడంలో విఫలమైతే రాష్ట్ర ప్రజలకు చేసిన తీవ్ర ద్రోహాన్ని మాత్రమే రుజువు చేస్తుందన్నారు. ఆదివారం సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా వివరిస్తూ 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో సోనియా, రాహుల్, ప్రియాంక గాంధీ వ్యక్తిగతంగా ఇచ్చిన హామీలు, గ్యారంటీల ఆధారంగానే తెలంగాణ ప్రజలు కాంగ్రెస్ పార్టీపై నమ్మకం ఉంచారని లేఖలో పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినప్పటికీ మహిళలు, రైతులు, విద్యార్థులు, యువత, వృద్ధులు, వ్యవసాయ కార్మికులు, పేద కుటుంబాలకు ఇచ్చిన పలు కీలక హామీలు ఇంకా నెరవేర్చ లేదన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు లభిస్తుందని రైతులు వేచి చూస్తూనే ఉన్నారని కౌలు రైతులు, రైతు కూలీలు ఇందిరమ్మ ఇండ్ల కోసం ఎదురుచూస్తున్న పేద కుటుంబాలకు కూడా నిరాశే ఎదురవుతోందన్నారు. వృద్ధులు నెలకు రూ.4 వేల పెన్షన్, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు ఆర్థిక సహాయాన్ని పెంచుతామని హామీ ఇచ్చినప్పటికీ, అది ఇప్పటికీ అమల్లోకి రాలేదని పేర్కొన్నారు.

# ఉత్కంఠగా ముగిసిన నీట్‌యూజీ..

(మొదటి పేజీ తరువాయి)

**బురఖాలు, రుద్రాక్షల తొలగింపు**

పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు తనిఖీల సమయంలో విద్యార్థులను మతపరమైన వస్త్రాలు, ఇతర వస్తువులను తొలగించాలని కోరడంతో పలు చోట్ల స్వల్ప వివాదాలు తలెత్తాయి. కోల్‌కతా పరిధిలో గల ధాకురియాకు చెందిన సృష్టి దూబె పరీక్షకు వారం రోజుల ముందు రోడ్డు ప్రమాదంలో గాయపడి, సర్జరీ చేయించుకుంది. ఆమె అధికారుల సహాయంతో ప్రత్యేక వైద్య ఏర్పాట్ల మధ్య పరీక్ష రాసి, తన పట్టుదలను చాటుకుంది.

**రవాణా ఇబ్బందులతో విద్యార్థుల విలవిల**

పరీక్ష కేంద్రాలకు చేరుకోవడంలో తాము పలు రవాణా ఇబ్బందులను ఎదుర్కొన్నామని పలువురు విద్యార్థులు తెలిపారు. మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఇద్దరు విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఆలస్యంగా రావడంతో, వారిని లోనికి అనుమతించలేదు. మరోవైపు కోల్‌కతాలో భారీ వర్షాల కారణంగా రోడ్లన్నీ జలమయంగా మారి, ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పలువురు పరీక్ష కేంద్రానికి వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. కాగా ముంబైలో 'బెస్ట్' ఉద్యోగుల సమ్మె కొనసాగుతున్నప్పటికీ, మున్సిపల్ కార్పొరేషన్ విద్యార్థుల కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

**'ఈసారైనా పరీక్ష పారదర్శకంగా జరగాలి'**

ఢిల్లీలో పరీక్షకు హాజరైన కిషన్ అనే అభ్యర్థి 'పీటీఐ'తో మాట్లాడుతూ 'గత పరీక్షతో పోలిస్తే ఈసారి భద్రతను భారీగా పెంచారు. గత నెల రోజుల్లో ఎన్నో పరిణామాలు చోటు చేసుకున్నాయి. నేను శక్తిమేరకు రివిజన్ చేసుకున్నాను. ఈ సారైనా పరీక్ష పారదర్శకంగా జరుగాలని కోరుకుంటున్నాను. ముఖ్యంగా క్వాలిఫై అవుతామనుకున్న అభ్యర్థులు మానసిక వేదనతో నలిగిపోయారు' అని పేర్కొన్నాడు.

**12 భారతీయ భాషల్లో పరీక్ష**

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) తెలిపిన వివరాల ప్రకారం ఈ పరీక్షను ఇంగ్లిష్‌తో పాటు 12 భారతీయ భాషల్లో నిర్వహించారు.

**పరీక్ష ముగియగానే ఆన్సర్ షీట్ల సీజ్**

పరీక్ష ముగిసిన వెంటనే ఇన్విజిలేటర్లు ఓఎంఆర్ జవాబు పత్రాలను సీజ్ చేసి, భద్రతా కేంద్రాలకు తరలించారు. కొద్ది రోజుల్లో ఎన్‌టీఏ ఈ పరీక్షకు సంబంధించిన ప్రొవిజినల్ కీని విడుదల చేసి, అభ్యంతరాలను స్వీకరిస్తుంది.

**కఠినంగా భౌతిక శాస్త్ర ప్రశ్నలు**

అభ్యర్థుల నుంచి అందిన ప్రాథమిక స్పందనల ప్రకారం ప్రశ్న పత్రం మధ్యస్థం నుంచి కఠినంగా ఉన్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా భౌతికశాస్త్రం సెక్షన్ అత్యంత సవాలుగా నిలిచింది. నిపుణులు, కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌ల ప్రాథమిక విశ్లేషణ ప్రకారం ఫిజిక్స్, కెమిస్ట్రీ. బయాలజీ సబ్జెక్టుల ప్రశ్నల సరళి, క్లిష్టత స్థాయి, గత పరీక్షలతో పోలికలపై సమగ్రం సమాచారం త్వరలోనే అందుబాటులోకి రానున్నది.



# పిట్ల వారి నూతన వస్త్రలంకరణ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి!

**మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులు!!**

శివంపేట జూన్ 21 (సిరి న్యూస్ ): శివంపేట మండల కేంద్రంలోని దొంతి జీవన్ దివ్య కన్వెన్షన్ హాల్లో స్వర్గీయ పిట్ల సత్యనారాయణ కుమారుడు పిట్ల ధనుష్ మరియు కుమారి పిట్ల హరిణి నూతన వస్త్రా అలంకరణ వేడుకలో ముఖ్య అతిథులుగా నర్సాపూర్ శాసన సభ్యురాలు సునీత లక్ష్మారెడ్డి. హాజరైనారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శివంపేట మండలంలో బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులుగా పిట్ల సత్యనారాయణ పార్టీకి ఎనలేని సేవ చేశారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్ర గౌడ్, మాజీ ఎంపీపీ కల్లూరిహరికృష్ణ, జిల్లా మాజీ కో ఆప్షన్ సభ్యులు మన్సూర్ అహ్మద్, శివంపేట మండల మాజీ కో ఆప్షన్ సభ్యులు ఎండి లాయక్, నీరుడి బాబు భద్దుల బిక్షపతి, హరి ప్రసాద్, శ్రీనివాస్,రాహుల్, గ్రామ మాజీ ఉపసర్పంచ్ సత్యనారాయణ, పంచాయితీ సభ్యులు పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# గాంధీ పేరు చెప్పి పేదల ఇండ్లు కూల్చొద్దు : కేటీఆర్



(సిరి న్యూస్) శంషాబాద్: పట్టణంలోని ఓ కన్వెన్షన్ హాలులో ఆదివారం నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సభ్యత్వ నమోదు కార్యక్రమంతో పాటు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)పై పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీజేపీలపై తీవ్ర విమర్శలు గుప్పించారు. గాంధీ పేరుతో రేవంత్ రెడ్డి చేస్తున్న విధ్వంసాన్ని చూస్తే మహాత్మా గాంధీ ఆత్మ కూడా ఘోషిస్తుందని కేటీఆర్ అన్నారు. రేవంత్ రెడ్డి నమ్మేది గాడ్సేనని, అలాంటి వ్యక్తి మహాత్మా గాంధీ విగ్రహం పెడతానని చెప్పడం దొంగ మాటలేనని విమర్శించారు. గాంధీపై నిజమైన ప్రేమ ఉంటే పేదల ఇండ్లను కూల్చకుండా కాపాడాలని సూచించారు. మూసీ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం విధ్వంసపు రాజకీయాలు చేస్తోందని, ఈ చర్యలకు బీజేపీ కూడా మద్దతు ఇస్తోందని ఆరోపించారు. ప్రధాని నరేంద్ర మోదీతో మాట్లాడుకుని "చోటే భాయ్-బడే భాయ్"లా రేవంత్ రెడ్డి, మోదీ ఇద్దరూ కలిసి నిరుపేదల ఇండ్లను కూల్చి మూసీ భూములను కొల్లగొడుతున్నారని విమర్శించారు. మోదీకి నిజాయితీ ఉంటే పేదల భూములు లాక్కోవద్దని, వారికి అన్యాయం చేయవద్దని ఎందుకు ప్రశ్నించడం లేదని నిలదీశారు. స్థానికంగా బీజేపీ నేతలు పెద్ద పెద్ద మాటలు మాట్లాడుతున్నా, వారి సొంత ప్రభుత్వం మాత్రం ఇండ్లు కూల్చేందుకు అనుమతులు ఇస్తోందని అన్నారు. గతంలో వచ్చిన అర్జున్ రెడ్డి సినిమా హిట్ అయితే రేవంత్ రెడ్డి ఫ్లాప్ సినిమా అని ఈ సందర్భంగా కేటీఆర్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు.

**ఒక్క హామీ నెరవేర్చలే**

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా ఎన్నికల్లో ఇచ్చిన ఒక్క హామీని కూడా నెరవేర్చేందుకు డబ్బులు లేవని చెబుతోందని, అదే ప్రభుత్వం మూసీ ప్రాజెక్టు కోసం మాత్రం లక్షన్నర కోట్ల రూపాయలు ఖర్చు చేసేందుకు సిద్ధమవుతోందని విమర్శించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఓడించాలని ప్రజలంతా ఎదురుచూస్తున్నారని వ్యాఖ్యానించారు.

**ప్రకాష్ గౌడ్‌పై విమర్శలు**


బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి అభివృద్ధి పేరుతో పార్టీ మారిన ప్రకాష్ గౌడ్ గత రెండున్నరేళ్లలో ఒక్క అభివృద్ధి పని కూడా చేయలేదని కేటీఆర్ విమర్శించారు. ఎంతమంది పెద్ద నాయకులు పార్టీని వీడినా గులాబీ సైన్యం బలంగానే ఉందని, రానున్న ఎన్నికల్లో కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిగా తీసుకొచ్చి బీఆర్ఎస్ జెండాను ఎగురవేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, మాజీ శాసనమండలి చైర్మన్ స్వామి గౌడ్, ఎమ్మెల్సీలు నవీన్ కుమార్ రెడ్డి, సురభి వాణీదేవి, మాజీ ఎమ్మెల్యేలు మంచిరెడ్డి కిషన్ రెడ్డి, అంజయ్య యాదవ్, రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కార్తీక్ రెడ్డి, సీనియర్ నాయకులు రావుల శ్రీధర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యుత్ ఉద్యోగులకు డిజిటల్ అటెండెన్స్ !

తెలంగాణ బ్యూరో సిరి న్యూస్: తెలంగాణ పరిధిలో వరంగల్ కేంద్రంగా నడుస్తున్న టీజీఎన్పీడీసీఎల్ లో విద్యుత్ ఉద్యోగుల హాజరుపై యాజమాన్యం దృష్టి సారించింది. ఇది వరకు సర్కిల్, డివిజన్,సెక్షన్ కార్యాలయాల్లో పనిచేసే అధికారులకు మాత్రమే అక్కడ రిజిస్టర్ లో హాజరు నమోదు చేయాల్సి వచ్చేది. కానీ కొత్తగా టెక్నాలజీ ద్వారా తెస్తున్న విధానం మూలంగా ఆపరేషన్ పరిధిలోని ఎస్ఈ స్థాయినుండి క్షేత్ర స్థాయిలో ఉండే జెఎల్ఎమ్ వరకు వ్యక్తిగత హాజరు ఎంప్లాయ్ పోర్టల్ లో నమోదు చేయాల్సిందే. ఈ మేరకు నేటి నుండి టీజీఎన్పీడీసీఎల్ పరిధిలో కొత్త యాప్ ద్వారా హాజరు ఎవరికీ వారే నమోదు చేసుకునేలా డిజిటల్ సెల్ఫ్ అటెండెన్స్ విధానాన్ని తీసుకువచ్చారు.

**ఎలా వాడాలంటే !**

ఉద్యోగులు తమ వ్యక్తిగత హాజరు నమోదు చేసుకోవడానికి ఎన్పీడీసీఎల్ ఎంప్లాయ్ యాప్ ను డౌన్లోడ్ చేసుకోవాలి. యాప్ లో హాజరు వేసుకోవడానికి ఉద్యోగి ఐడి ,డిసిగ్నేషన్ నమోదు చేయాలి. ఉదయం తాము పని చేసే చోటు నుండి హాజరు వేసుకుంటే ఆ ఉద్యోగి ఉన్న లొకేషన్ తో సహా నమోదు అవుతుంది. ఒకవేళ హాజరు కాలేకుంటే అది కూడా నమోదు చేసుకునే వెసులు బాటు ఉంది. ఆలా చేస్తే ఆ రోజు ఉద్యోగికి సెలవు గా నమోదవుతుంది. ఇక సాయంత్రం 6 గంటల తరవాత ఈవెనింగ్ సెషన్ లో హాజరు నమోదు చేయాల్సి ఉంటుంది. అప్పుడే ఆ ఉద్యోగి ఆ




రోజు సంపూర్ణంగా పనిచేసినట్టు లెక్క .ఈ యాప్ లో ఉదయం 10 దాటినా సాయంత్రం 6 లోపల వ్యక్తిగత హాజరు నమోదు చేసే అవకాశం లేదు.

**క్షేత్ర స్థాయిలో ఉద్యోగుల ప్రత్యక్ష పర్యవేక్షణ కోసమే డిజిటల్ విధానం!**

టీజీఎన్పీడీసీఎల్ లో సీఎండీ గా బాధ్యతలు చేపట్టిన నాటినుండి సీఎండీ వరుణ్ రెడ్డి వినియోగదారులకు ఎలాంటి సమస్యలు రాకుండా ఎన్నో మార్పులు తీసుకువచ్చారు. ఇటీవల కాలంలో ప్రమాదాలు జరగకుండా ఎన్నో జాగ్రత్తలు తీసుకుంటున్నప్పటికీ ఏదో ఒక చోట సమస్య పునరావృతం అవుతూనే ఉంది. ఇటీవల వరంగల్ జిల్లా వర్ధన్నపేటలో జరిగిన ఒక ప్రమాదానికి తప్పుడు ఎల్సి కారణం కావడంతో , క్షేత్ర స్థాయిలో సిబ్బంది హాజరు పై అయన దృష్టి సారించారు. ఆపరేషన్ విభాగంలో పనిచేసే కొందరు సిబ్బంది ఎల్సి లు తీసుకునేటప్పుడు సమస్య ఉన్న చోట కాకుండా వాళ్ళు ఎక్కడో ఉండి ఎల్సి లు తీసుకోవడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్న విషయం సీఎండీ దృష్టికి వచ్చినట్టు సమాచారం. అందుకే డిజిటల్ అటెండెన్స్ విధానాన్ని ప్రవేశపెట్టి పని చేసే చోటే ఉద్యోగి ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. కొత్త విధానం మూలంగా కంపెనీ పరిధిలోని వ్యక్తిగత హాజరు తెలుసుకునే అవకాశం ఉంటుంది.

**ఒక ఫోన్ లో ఒక్కరికే !**

సెల్ఫ్ అటెండన్స్ విధానం ద్వారా కొత్త గా వచ్చిన యాప్ లో ఒక ఫోన్ లో ఒక్కరికే వ్యక్తిగత హాజరు నమోదు చేసుకునే అవకాశం ఉంటుంది.ఆండ్రాయిడ్ ఫోన్ వాడరాని వారు వారి హాజరు సహచర సిబ్బందితో నమోదు చేయించుకోవాలి. అలాగే ఆండ్రాయిడ్ ఫోన్ లేని వాళ్ళు తప్పనిసరిగా ఫోన్ కొనుగోలు చేసుకోవాలి లేకుంటే వారి హాజరు నమోదు కాదు.

## తెలంగాణ నుంచి రాజ్యసభ సీటు తీసుకోలేను: మీనాక్షి నటరాజన్

(సిరి న్యూస్) హైదరాబాద్: తన రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో భాజపా కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోందని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ అన్నారు. తనపై లీగల్ కేసులేమీ లేవని చెప్పారు. ఇటీవల మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ స్థానానికి ఆమె వేసిన నామినేషన్‌ను ఎన్నికల సంఘం తిరస్కరించిన విషయం తెలిసిందే. ఓ కేసు అంశాన్ని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొనలేదనే కారణంతో ఈసీ ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో మీనాక్షి నటరాజన్ స్పందించారు. భాజపా, ఈసీ లాలూచీపడి తన నామినేషన్‌ను తిరస్కరించారని ఆరోపించారు. ''నా సీటు చోరీ జరిగింది. భాజపా చేస్తున్న కుట్రలు సమాజానికి తెలియజేయాలనే పోరాడుతున్నాం. నాకోసం మరొకరితో రాజీనామా చేయించి తెలంగాణలో రాజ్యసభ సీటు తీసుకోలేను. మధ్యప్రదేశ్‌కు చెందిన వ్యక్తిని కాబట్టే అక్కడి నుంచే సీటు కోరుకుంటా. నా కేసుల సమాచారాన్ని కాంగ్రెస్ నేతలు ఇచ్చారనేది పచ్చి అబద్ధం. భాజపా కావాలనే తప్పుడు ప్రచారాలు చేస్తోంది. కేసు ఉన్నంత మాత్రాన నామినేషన్ తిరస్కరణ కాలేదు. భాజపా నేతలను నామినేషన్ రూమ్‌లోకి ఎందుకు అనుమతించారు?'' అని మీనాక్షి నటరాజన్ ప్రశ్నించారు.

# ఓటర్ల జాబితా ప్రక్షాళనపై అపోహలు వద్దు..



- ఎంఐఎం, కాంగ్రెస్ లు కావాలని అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయి.
- మెదక్ ఎంపీ రఘునందన్ రావు

రామాయంపేట , జూన్ 21 (సిరి న్యూస్): కేంద్ర ఎన్నికల కమిషన్ చేపట్టిన ఓటర్ల జాబితా ప్రక్షాళన (ఎస్ ఐ ఆర్) కార్యక్రమంపై ప్రతిపక్ష పార్టీలు ప్రజల్లో అనవసరమైన అపోహలు సృష్టిస్తున్నాయని మెదక్ ఎంపీ రఘునందన్ రావు మండిపడ్డారు. ఆదివారం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో భాగంగా ఎన్నికల కమిషన్ చేపట్టిన ఈ కార్యక్రమంపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కొట్టిపారేశారు. ఈ ఎస్ ఐ ఆర్ కార్యక్రమం దేశంలో పదకొండవ సారి జరుగుతుందని ఇది భారత రాజ్యాంగం ప్రకారం ఎన్నికల కమిషన్ చేసే చట్టబద్ధమైన ప్రక్రియ అని ఆయన స్పష్టం చేశారు. ఎంఐఎం, కాంగ్రెస్ పార్టీలు కావాలనే ఒక వర్గం ఓట్లు తొలగిస్తారని ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నాయని ఆయన ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన బూత్ లెవల్ అధికారుల ద్వారానే ఈ ప్రక్రియ జరుగుతోందని, తమ సొంత ప్రభుత్వం నియమించిన ఉద్యోగులపై నమ్మకం లేదా అని ఆయన ప్రశ్నించారు. ప్రజలందరూ తమ వివరాలను నమోదు చేసుకుని ఎన్యుమినేటర్ ఫామ్ నింపి, బూత్ లెవల్ అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ఎన్యుమినేటర్ ఫామ్ నింపకపోతే ఓటు రద్దయ్యే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. పొరపాటున రెండు చోట్ల వివరాలు నమోదు చేసుకుంటే ఓటు రద్దు అవుతుందని, కాబట్టి ఓటర్లు అప్రమత్తంగా ఉండాలని ఎంపీ సూచించారు.ఈ కార్యక్రమం ఓటర్ల జాబితాలోని తప్పులను సరిదిద్దడానికి, బోగస్ ఓట్లను తొలగించడానికి జరుగుతోందని దీనిని ప్రజలు అర్థం చేసుకుని సహకరించాలని ఎంపీ రఘునందన్ రావు కోరారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులతో పాటు పలువురు పాల్గొన్నారు.

# హైడ్రాలు, బుల్డోజర్లు పేదోళ్ల ఇళ్లపైకేనా.....?

(మొదటి పేజీ తరువాయి)

కేసీఆర్ వస్తారని, ఆ తర్వాత ఇదే ప్రాంతానికి తాను వచ్చి మీ అందరికి ఇళ్లపట్టాలు ఇస్తానని భరోసా ఇచ్చారు. అందరు ఐక్యంగా ఉండి పోరాడాలన్నారు.

**గుంపు మేస్త్రీ ఇండ్లు కడుతాడు.. కూల్చడు**

ఎవరి మాటలు నమ్మవద్దన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో హనుమాన్ నగర్ ప్రజలను ఎప్పుడు డిస్ట్రబ్ చేయలేదని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి పదవి అంటే గుంపు మేస్త్రీ అని అన్నాడని, గుంపు మేస్త్రీ ఇండ్లు కడుతాడని, కూల్చడని కేటీఆర్ గుర్తు చేశాడు. రేవంత్ రెడ్డి పాలన సగం అయ్యిందని, మరో సగం ఉందన్నారు. ఆ సగంలో ఒక సంవత్సరం తర్వాత ఎన్నికలు ప్రక్రియ ప్రారంభమౌతుందని, అప్పుడు ఆయన



మాటలు ఎవరు వినరన్నారు. వృద్ధులకు రూ.4వేలు ఇస్తానన్నాడు.... కోడళ్లకు రూ.2500లు, విద్యార్థినీలకు స్కూటీలు, షాదీముబారక్ ద్వారా బీఆర్ఎస్ ప్రభుత్వం ఇచ్చిన లక్షా నూటపదహార్లు కాక తులం బంగారం ఇసా నన్నాడు... అవి అని ఎందుకు నెరవేర్చలేదో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ నుంచి రాజేంద్రనగర్ ఎమ్మెల్యేగా గెలుపొందిన వ్యక్తికి ఏం రోగం వచ్చిందో.. ఆయన వెళ్లిపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దానికి హనుమాన్ నగర్ వాసులు స్పందిస్తు ఈ రోజు మీటింగ్ పెడుతున్నారంటా అని బెదిరిస్తున్నాడని చెప్పగా మీరు న్యాయం కోసం ధర్మం కోసం పోరాడుతున్నారని ఎవరేమన్నా పట్టించుకోవద్దన్నారు. మీ వెంట కార్తీక్ రెడ్డి ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు. ప్రభుత్వం మీ ఇళ్లకు నోటీసులు ఇస్తే మీ తరపున లాయర్లను మేము పెట్టి పోరాటం చేస్తామని గుర్తు చేశారు. కార్యక్రమంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి సబితా ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జి కార్తీక్ రెడ్డి, స్థానిక నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## భారత సముద్రశక్తి మరింత బలోపేతం

(సిరి న్యూస్) : భారత సముద్రశక్తి మరింత బలోపేతం ......ఒకే రోజు మూడు యుద్ధనౌకలను ప్రారంభించి జాతికి అంకితం చేసిన ప్రధాని నరేంద్ర మోదీ మీ స్పందన : భారత నౌకాదళాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రధాని నరేంద్ర మోదీ ఐఎన్ఎస్ దుణగిరి, ఐఎన్ఎస్ సంశోధక్, ఐఎన్ఎస్ అగ్రయ్ అనే మూడు యుద్ధ నౌకలను జాతికి అంకితం చేశారు. శత్రువుల రహస్య ఎత్తుగడలను చిత్తు చేసేలా అత్యాధునిక దేశీయ పరిజ్ఞానంతో తయారు చేసిన వీటిని కోల్‌కతాలోని శ్యామా ప్రసాద్ ముఖర్జీ పోర్టులో ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. రక్షణ రంగంలో స్వావలంబన కోసం భారత్ చేస్తున్న కృషికి ఈ నౌకలు నిదర్శనమని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారతీయ పరిశ్రమల ప్రతిభ, ఇంజినీర్ల నైపుణ్యం, కార్మికుల కఠోర శ్రమ వల్లే వీటి నిర్మాణం సాధ్యమయ్యిందన్నారు. --ఐఎన్ఎస్ దుణగిరి భారత నేవీలో విశిష్ట సేవలు అందించిన నీలగిరి శ్రేణిగా ఐఎన్ఎస్ దుణగిరి యుద్ధనౌకను ఎంతో ప్రత్యేకంగా నిర్మించారు. ప్రాజెక్టు 17ఏ పేరిట నిర్మించిన నౌకను 2022 జులై 15న జలప్రవేశం చేయించారు. దీని పొడవు 149 మీటర్లు. అడ్వాన్స్‌డ్ గైడెడ్ మిసైల్ ఫ్రిగేట్‌గా తీర్చిదిద్దారు. రాడార్, సెన్సర్‌లతో బహుముఖ పాత్ర పోషించేందుకు అనువుగా నిర్మించిన ఈ నౌక బ్రహ్మోస్ యాంటీ షిప్ క్రూజ్ క్షిపణులను కలిగి ఉంది. --ఐఎన్ఎస్ సంశోధక్ భారత నౌకాదళానికి సముద్ర భౌగోళిక, (హైడ్రోగ్రాఫిక్ సర్వే) సరిహద్దు జలాలు, సమగ్ర కొలతలు, కచ్చితత్వ పరిమాణం వంటి అంశాలపై నివేదికల తయారీలో సామర్థ్యం పెంచేందుకు దోహదపడేలా ఐఎన్ఎస్ సంశోధక్ నౌకను నిర్మించారు. ఇది 110 మీటర్ల పొడవుతో ఉంటుంది. 2023 జూన్ 13న జలప్రవేశం చేయించారు. పోర్టులు, లోతైన సముద్ర మార్గాలు, మారిటైం పరిధిలో సముద్ర అధ్యయనం, నావిగేషన్ విధుల కోసం ప్రత్యేక హెలికాప్టర్, విపత్కర పరిస్థితుల్లో మానవీయ సాయానికి, రక్షణ చర్యలు చేపట్టేందుకు అనువుగా సంశోధక్ నిర్మాణం చేశారు. --ఐఎన్ఎస్ అగ్రయ్ కోల్‌కతాలోని గార్డెన్‌రీచ్ షిప్‌బిల్డింగ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ)లో ఐఎన్ఎస్ అగ్రయ్ నౌకను యాంటీ సబ్‌మెరైన్ షాలో వాటర్ క్రాఫ్ట్‌గా నిర్మించారు. ఇది 77.6 మీటర్ల పొడవుంటుంది. 2024 మార్చి 13న జలప్రవేశం చేయించారు. తీర జలాల్లో ఆపరేషనల్ విధులకు అనువుగా ఈ యుద్ధనౌకను డిజైన్ చేశారు. ఉపరితల నిఘా, అన్వేషణ, శత్రువులపై దాడికి స్వీయ ఎయిర్‌క్రాఫ్ట్‌తో సమన్వయం చేసుకునేలా 88 శాతం ఆధునిక స్వీయ సాంకేతిక పరిజ్ఞానం వినియోగించారు.

# మెలోనిపై మరోసారి మండిపడ్డ ట్రంప్

(సిరి న్యూస్): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇటలీ ప్రధాని మెలోని మధ్య వైరం రోజురోజుకు ముదురుతుంది. తాజాగా మెలోని వ్యాఖ్యలకు ట్రంప్ కౌంటరిచ్చారు. ఇటలీలో ఆమె పనులు సరిగ్గా లేవని అందుకే ఆమె.. తనను విమర్శిస్తూ కొత్త ఎత్తుగడలు వేస్తున్నారన్నారు. అయితే దీనికి మెలోనీ సైతం కౌంటరిచ్చింది. తన ప్రజాదారణతో మీకేం పని అని ట్రంప్‌ను ప్రశ్నించింది. డొనాల్డ్ ట్రంప్ వ్యవహార శైలి గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఎప్పుడూ ఏదో వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తూ తరచుగా వార్తల్లో నిలుస్తూ ఉంటారు. తాజాగా ఆయన ఇటలీ ప్రధానిపై చేసిన వ్యాఖ్యలు ఇరు దేశాల మధ్య అగ్గి రాజేస్తున్నాయి.. ట్రంప్ వ్యాఖ్యలను మెలోని ఇదివరకే ఖండించగా మరోసారి సోషల్ మీడియా వేదికగా ట్రంప్ రెచ్చిపోయారు. తన సోషల్ మీడియా ట్రూత్ వేదికగా స్పందిస్తూ.."ఇటలీలో మెలోని ప్రజాదరణ చాలా బలహీనంగా ఉంది. ఇరాన్ అణుబాంబు తయారీని అడ్డుకునే విషయంలో ఆమె అమెరికాకు మద్దతు ఇవ్వకపోవడమే దీనికి కారణం కావచ్చు. నిజానికి ఇటలీని అమితంగా ప్రేమించేది, రక్షించేది అమెరికా మాత్రమే ఆ మాటకు వస్తే నాటో కూడా ఇరాన్ విషయంలో అలాగే వ్యవహరించింది" అని రాసుకొచ్చారు. అదేవిధంగా యుద్ధ సమయంలో ఇటలీకి చెందిన రన్‌వేలను లేదా ల్యాండింగ్ స్ట్రిప్‌స్‌ను అమెరికా వాడుకోకుండా మెలోని అడ్డుకున్నారని ఆరోపించారు. ఇటలీతో పాటు ఇతర నాటో కూటమి దేశాల రక్షణ కోసం అమెరికా ప్రతిటా వందల బిలియన్ల డాలర్లు ఖర్చు చేస్తోంది. అయినప్పటికీ మెలోని కనీసం మా విమానాలు ల్యాండ్ అవ్వడానికి కూడా అనుమతించలేదు. ఇది మాకు తీవ్రమైన రవాణా ఇబ్బందిని కలిగించిందని.. ఇప్పుడు తన ప్రజాదరణ రేటింగ్‌లను పెంచుకోవడం కోసమే ఆమె నాతో స్నేహం నటిస్తున్నారని ట్రంప్ మండిపడ్డారు.

**మెలోని స్పందన**

ట్రంప్ చేసిన ఈ ఘాటు వ్యాఖ్యలపై ఇటలీ ప్రధాని జార్జియా మెలోని అంతే తీవ్రంగా స్పందించారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా ఆమె ట్రంప్‌కు గట్టి కౌంటర్ ఇచ్చారు. "ఇలాంటి కారణం లేని, నిరంతర దాడులు అర్థరహితమైనవి. మీతో స్నేహం చేయడం వల్ల నా ప్రజాదరణ పెరిగిందేమీ లేదు, అది మీతో ఉండే సంబంధాలపై ఆధారపడి కూడా లేదు. ఇటలీ జాతీయ ప్రయోజనాలను కాపాడటంలో నాకున్న సామర్థ్యంపైనే నా ప్రజాదరణ ఆధారపడి ఉంటుంది. నేను ఎప్పుడూ దాన్నే చేస్తూ వచ్చాను" అని మెలోని స్పష్టం చేశారు. ఏది ఏమైనప్పటికీ, నా ప్రజాదరణ గురించి మీకేం అవసరం లేదు. దానికి బదులు మీ పాపులారిటీపై మీరు దృష్టి పెడితే మంచిదని నా సూచన అంటూ మెలోని ట్రంప్‌పై విరుచుకుపడ్డారు.



# ఫాదర్స్ డే... రాజకీయ వేడి..

- ఫాదర్స్ డే వేళ మోదీపై వ్యంగ్యాస్త్రాలు..
- హామీలపై ఎంపీ వంశీ ఘాటు విమర్శలు..
- కేంద్ర వైఫల్యాలపై ప్రశ్నల వర్షం..
- సోషల్ మీడియాలో రాజకీయ దుమారం..

మంచిర్యాల జూన్ 21 (సిరి న్యూస్): ఫాదర్స్ డే సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ తీవ్ర విమర్శలు గుప్పించారు. గత పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పథకాలు, ఎన్నికల హామీలు, తీసుకున్న కీలక నిర్ణయాల ఫలితాలపై ప్రశ్నలు లేవనెత్తుతూ సామాజిక మాధ్యమాల వేదికగా వ్యంగ్య వ్యాఖ్యలు చేశారు. దేశ ప్రజలు, ముఖ్యంగా యువత, నిరుద్యోగులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన సమయం వచ్చిందని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు కాకపోవడం వల్ల ప్రజల్లో అసంతృప్తి పెరుగుతోందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా ఆయన ప్రధానమంత్రి మోదీని ఉద్దేశించి నోట్ల రద్దు తండ్రి, నాటకీయ రాజకీయాల తండ్రి, మధుర దౌత్య తండ్రి, రూపాయి విలువ పతనానికి తండ్రి, ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాల హామీ తండ్రి, నల్లధనం తండ్రి, నీట్ ప్రశ్నపత్రాల లీకేజీలు, కుంభకోణాల తండ్రి, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామన్న హామీ తండ్రి, ప్రతి ఖాతాలో రూ.15 లక్షలు జమ చేస్తామన్న హామీ తండ్రి, అచ్చే దిన్ తండ్రి" అంటూ విమర్శనాత్మక వ్యాఖ్యలు చేశారు. దేశ యువత, నిరుద్యోగులు, రైతులు, సామాన్య ప్రజలు నేడు అనేక సవాళ్లను ఎదుర్కొంటున్నారని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రజలు సమాధానాలు కోరుతున్నారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో విఫలమైందని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో ప్రజలకు జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని, ఎన్నికల హామీలు కేవలం ప్రచార నినాదాలుగానే మిగలకూడదని వంశీకృష్ణ పేర్కొన్నారు. ప్రజల జీవితాలను ప్రభావితం చేసే అంశాలపై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన సమాధానాలు ఇవ్వాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. చివరగా ఇదే నేటి భారత్. ఫాదర్స్ డే శుభాకాంక్షలు నరేంద్ర మోదీ. జై హింద్! జై భారత్! అంటూ తన సందేశాన్ని ముగించారు.

## ఆర్టీసీ ఎలక్ట్రిక్ బస్సు దగ్ధం

(సిరి న్యూస్) తెతిమ్మాపూర్: కరీంనగర్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న సూపర్ లగ్జరీ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడం, దట్టమైన పొగ వ్యాపించడంతో అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు ఒక్కసారిగా హాహాకారాలు చేయడం స్థానిక ప్రజలను భయాందోళనకు గురి చేసింది. ఈ ఘటన కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం అలుగునూర్ శివారులోని రాజీవ్ రహదారిపై ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. ప్రయాణికులు, స్థానికుల కథనం మేరకు.. కరీంనగర్ టు డిపోకు చెందిన సూపర్ లగ్జరీ ఎలక్ట్రిక్ బస్సు ఉదయం కరీంనగర్ బస్టాండ్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణికులతో బయలుదేరింది. కాగా దాదాపు మూడు కిలోమీటర్ల మేర ప్రయాణం పూర్తి కాగా అలుగునూర్ శివారులోని కాకతీయ కాలువ వద్దకు రాగానే బస్సులో ఆకస్మాత్తుగా మంటలు, దట్టమైన పొగ రావడంతో బస్సులో ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. అయితే డ్రైవర్ బస్సు ప్రధాన ద్వారం తెరవడంతో వెంటనే ప్రయాణికులు కిందకు దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అయితే మంటలు క్షణాల్లో వ్యాపించడంతో డ్రైవర్, కండక్టర్ లు ఉన్నతాధికారులకు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. అయితే బస్సులో ఆకస్మాత్తుగా మంటలు ఎలా వ్యాపించాయో తెలియాల్సి ఉంది.

## అయోధ్యను వీడి వెళ్లొద్దు'

(సిరి న్యూస్): ఉత్తర్‌ప్రదేశ్‌లోని అయోధ్య రామాలయంలో కానుకలు, నిధుల దుర్వినియోగం ఆరోపణలపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) తన విచారణను ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా అయోధ్యను వీడి వెళ్లొద్దని ఆలయ సిబ్బందిని, ట్రస్ట్ నిర్వాహకులను ఆదేశించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ట్రస్ట్ సభ్యులు తదితరులను విచారించిన వివరాలు, ఇతర అంశాలతో కూడిన నివేదికలను దర్యాప్తు అధికారులు డిజిటల్ రూపంలో భద్రపర్చుతున్నారని, అదే సమయంలో రోజువారీగా సీఎం కార్యాలయానికి పంపుతున్నట్లు చెప్పాయి.రామమందిర ట్రస్ట్ చేపట్టిన భూ కొనుగోళ్లు, ఆలయ నిర్మాణ సామగ్రి సేకరణ అంశాలపైనా సిట్ దృష్టి సారించినట్లు సమాచారం. మార్కెట్ ధర కంటే ఎక్కువ రేటుకు భూములను ట్రస్ట్ కొనుగోలు చేసిందనే ఆరోపణల నేపథ్యంలో ఈమేరకు చర్యలు తీసుకున్నట్లు తెలుస్తోంది. ఆలయంలోని నిఘా వ్యవస్థలు, భద్రత నిర్వహణను సిట్ బృందం ఇప్పటికే పరిశీలించింది. అయితే, 45 రోజుల ఫుటేజీ మాత్రమే అందుబాటులో ఉండటం సవాల్‌గా మారింది. సీసీటీవీ ఫుటేజీలను తారుమారు చేశారనే ఆధారాలను కూడా అధికారులు గుర్తించారని.. డిలీట్ చేసిన, మార్చిన డేటాను తిరిగి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అనేక వైరుధ్యాలు ఉన్నట్లు గుర్తించారు.

# యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం







**మెదక్, జూన్, 21(సిరిన్యూస్)**

యోగతోనే సంపూర్ణ ఆరోగ్యం సిద్దిస్తుందని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ పేర్కొన్నారు.ఆదివారం మెదక్ పట్టణంలోని ఇందిరాగాంధీ స్టేడియం ప్రాంగణంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్, మెదక్ ఆర్డీవో రమాదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి భూక్య జ్ఞానేశ్వర్ , డిసిహెచ్ఎస్ డాక్టర్ శివదయాల్ , ఆయుష్ విభాగం మోహన్ రెడ్డి , జిల్లా యువజన క్రీడల నిర్వహణ అధికారి రమేష్ ,విశిష్ట యోగ గురువు ఆకుల రవి తో కలిసి జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా కలెక్టర్ ప్రతిమాసింగ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. “ఆరోగ్యవంతమైన వృద్ధాప్యం కోసం యోగ” అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో,జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ అంబదాస్ రాజేశ్వర్ , మెదక్ ఆర్డీవో రమాదేవిలు స్వయంగా యోగా ఆసనాలు చేస్తూ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సొంతమవుతుందని ఆరోగ్యవంతమైన వృద్ధాప్యం కోసం యోగ” అనే థీమ్ తో ముందుకు సాగాలన్నారు. మానవ శక్తులన్నింటినీ ఏకం చేసే ఏకాగ్రత సాధించడం యోగాకే సాధ్యం. అన్నారు. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద యోగ అని పిలుపునిచ్చారు. “యోగ అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదు... శారీరక ఆరోగ్యం, మానసిక ప్రశాంతత, క్రమశిక్షణతో కూడిన జీవన విధానం. ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలి. భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద యోగ” అని పేర్కొన్నారు.అనంతరం యోగాలో పాల్గొన్న ఆయుష్ అధికారులు, విద్యార్థినీ విద్యార్థులు , క్రీడాకారులు క్రీడాభిమానులతో కలెక్టర్ ఫోటో సెషన్ లో కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో మెదక్ తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, విశిష్ట యోగ ఇన్స్ట్రక్టర్ దేవేందర్ రెడ్డి , పిడి ఆనందం , నరసింహులు , కొండల్ రెడ్డి ప్రజా ప్రతినిధులు, జిల్లా స్థాయి అధికారులు, మండల అధికారులు , వైద్య సిబ్బంది, విద్యార్థులు, యువత, మహిళాలు, స్వచ్ఛంద సంస్థలు, యోగా సాధకులు, ప్రజలు పాల్గొన్నారు.

**ఆరోగ్యవంతమైన వృద్ధాప్యం కోసం యోగా” అనే థీమ్**

- మానవ శక్తులన్నింటినీ ఏకం చేసి ఏకాగ్రత సాధించడం యోగాకే సాధ్యం
- భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప సంపద యోగ
- వయో,లింగ భేదం లేకుండా అందరూ యోగాను సాధన చేయాలి
- యోగా గురువు రవి అధికారులతో ఆసనాలు చేయించారు
- కలెక్టర్ ప్రతిమాసింగ్ యోగాసనాలు వేసి అందర్నీ ఉత్తేజపరిచారు
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్





## ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు

వెల్దుర్తి, జూన్ 21,(సిరి న్యూస్): 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈరోజు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, వెల్దుర్తి నందు యోగా కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ప్రతి సంవత్సరం జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవం ఆరోగ్యవంతమైన జీవన విధానానికి, మానసిక ప్రశాంతతకు మరియు శారీరక దృఢత్వానికి యోగా ఎంతగానో ఉపయోగపడుతుందనే సందేశాన్ని ప్రజలకు చేరవేస్తుంది. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు కలిసి యోగా సాధనలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్థానిక సర్పంచ్ ఆదర్శ్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ, యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన గొప్ప ఆధ్యాత్మిక మరియు ఆరోగ్య సంపద అని పేర్కొన్నారు. నిత్యం యోగా చేయడం ద్వారా శారీరక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా మానసిక ప్రశాంతత, ఏకాగ్రత మరియు ఆత్మవిశ్వాసం పెరుగుతాయని తెలిపారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సాంబయ్య మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు ఆరోగ్యంపైనా శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందని సూచించారు. రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవడం ద్వారా అనేక ఆరోగ్య సమస్యలను దూరం చేసుకోవచ్చని చెప్పారు. విద్యార్థులు ప్రతిరోజూ కొంత సమయం యోగా సాధనకు కేటాయించాలని ఆయన సూచించారు. యోగా మాస్టర్ మోహన్ రావు విద్యార్థులకు వివిధ యోగాసనాలు, ప్రాణాయామ విధానాలు ప్రదర్శించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. యోగా సాధన వల్ల శరీరంలో రక్త ప్రసరణ మెరుగుపడటం, ఒత్తిడి తగ్గడం, ఏకాగ్రత పెరగడం వంటి అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలిపారు. విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా యోగాసనాలు చేస్తూ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాసరావు , చార్లెస్ , విజయ్ మోహన్ , ఖదీర్ పాషా , రాము పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులందరూ యోగా సాధనలో పాల్గొని ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని ప్రతిజ్ఞ చేశారు.



### సామూహిక అక్షరాభ్యాసాన్ని ప్రారంభించిన
## ఎద్దులాపూర్ సర్పంచ్!

**కల్లూరి హనుమంతరావు.!!**

శివంపేట జూన్ 21 (సిరి న్యూస్ ): శివంపేట మండల కేంద్రంలోని ఏ ద్దలాపూర్ గ్రామంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా ఎదులాపూర్ సర్పంచ్ కల్లూరి హనుమంతరావు మరియు పాలకవర్గం సభ్యులతో కలిసి బడిబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ కల్లూరి హనుమంతరావు మాట్లాడుతూ బడి ఈడు పిల్లలందరూ ప్రభుత్వ బడిలోనే చదువుకోవాలని అన్నారు ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్యను అందిస్తుందని గుర్తు చేశారు. ప్రవేట్ పాఠశాలలో చేర్పించి అధికపీజీలు చెల్లించి ఆర్థికంగా నష్టపోవద్దని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ పాలకవర్గం సభ్యులు మరియు గ్రామస్తులు తదితరులు అక్షరాభ్యాసం కార్యక్రమంలో పాల్గొన్నారు.



### వన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే
## సంఘ సేవకులు మహమ్మద్ రఫీ

వెల్దుర్తి, జూన్ 21,(సిరి న్యూస్): ఆదివారం వెల్దుర్తి మండలంలో జలాల్పూర్ గ్రామంలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన కాళికామాత దేవాలయం వద్ద నిర్వహిస్తున్న ప్రత్యేక పూజలు,వన మహోత్సవ కార్యక్రమంలో నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మి రెడ్డి తో కలిసి,కార్యక్రమం పాల్గొన్న ప్రముఖ సంఘ సేవకులు,చేగుంట ఉపసర్పంచ్ మొహమ్మద్ రఫీ, కార్యక్రమాలు దేవాలయ అభివృద్ధికి తనవంతు సాయంగా ఒక్క లక్ష రూపాయలను అందజేసినట్టు దేవాలయ నిర్వాహకులు. తెలియజేశారు అనంతరం అక్కడికి వచ్చిన భక్తులు తమ యొక్క నక్షత్రం ప్రకారం తన నక్షత్రంతో ఉన్న మొక్కను నాటి వేద పండితుల ఆశీర్వాదాలు తీసుకోవడం జరిగింది. సంఘ సేవకులు రఫీ ఏర్పాటుచేసిన అన్న ప్రసాదమును తీసుకొని అమ్మవరి ఆశీర్వాదం తీసుకున్న గ్రామస్తులు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి రమేష్ గౌడ్,మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్ రెడ్డి,వెల్దుర్తి మాజీ సర్పంచ్ వెన్నవరం మోహన్ రెడ్డి,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోదండ కృష్ణ గౌడ్, వెన్నవరం శ్రీనివాస్ రెడ్డి, ప్రతాప్ రెడ్డి జగ్గా అశోక్ గౌడ్ సర్పంచులు రంగారెడ్డి,రంగి కృష్ణ,సాయిలు, చేగుంట మాజీ పిఏసిఎస్ చైర్మన్ అయిత రఘురాములు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు..



## జీఎంఆర్‌కు బీఆర్టీయూ కృతజ్ఞతలు..

- కార్మిక లోకానికి అండగా ఉంటానన్న ఎమ్మెల్యే

రామచంద్రపురం (పటాన్‌చెరు), జూన్ 21, (సిరి న్యూస్): పెన్నార్ పరిశ్రమ కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికల్లో బీఆర్టీయూ సాధించిన హ్యాట్రిక్ విజయానికి సంపూర్ణ సహకారం అందించిన పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డికి బీఆర్టీయూ నాయకులు ఆదివారం కృతజ్ఞతలు తెలిపారు. పటాన్‌చెరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, మిఠాయిలు తినిపించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ, గత మూడు పర్యాయాలుగా బీఆర్టీయూ నాయకత్వాన్ని బలపరుస్తూ హ్యాట్రిక్ విజయాన్ని అందించిన పెన్నార్ పరిశ్రమ కార్మికులకు అభినందనలు తెలిపారు. కార్మికులు ఉంచిన విశ్వాసాన్ని నిలబెట్టుకుంటూ ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసే దిశగా నాయకులు పనిచేయాలని సూచించారు. కార్మికుల సంక్షేమం, భవిష్యత్తు కోసం తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని, కార్మిక లోకానికి అండగా నిలుస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు, పెన్నార్ పరిశ్రమ అధ్యక్షుడు రాంబాబు యాదవ్, మాజీ ఎంపీపీ, పెన్నార్ పరిశ్రమ కార్యనిర్వాహక అధ్యక్షుడు యాదగిరి యాదవ్‌తో పాటు కార్మిక నాయకులు పాల్గొన్నారు.

## యోగతో సంపూర్ణ ఆరోగ్యం

- యోగ భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరం:
- జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్







యోగ భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వరం అని యోగతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ అన్నారు.12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం మెదక్ జిల్లా పోలీస్ కార్యాలయ ప్రాంగణంలోని పరేడ్ గ్రౌండ్‌లో జిల్లా పోలీసు సిబ్బందికి యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి పతంజలి మహిళ యోగ సమితికి చెందిన యోగా శిక్షకురాలు మనోరంజని హాజరై వివిధ యోగా ఆసనాలు, ప్రాణాయామాలను చేయించి వాటి ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమానికి మెదక్ జిల్లా అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, హాజరై 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, " శరీరం, మనసు, ఆత్మ మధ్య సమతుల్యతను నెలకొల్పే గొప్ప సాధన యోగ. ప్రతిరోజూ కొద్దిసేపు యోగా చేయడం ద్వారా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఏకాగ్రత పెరుగుతాయన్నారు.నేటి ఒత్తిడితో కూడిన జీవనశైలిలో యోగా ప్రతి ఒక్కరికీ అవసరం" అని అన్నారు. ముఖ్యంగా పోలీసు సిబ్బంది విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడి, అలసటను అధిగమించేందుకు యోగా ఎంతో ఉపయోగపడుతుందని, అందరూ నిత్యజీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. యోగా శిక్షణ అందించిన పతంజలి మహిళ యోగ సమితి ప్రతినిధి శ్రీమతి మనోరంజని గారికి అదనపు ఎస్పీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ డియస్పి ప్రసన్న కుమార్, సిఐ లు కృష్ణ మూర్తి, సందీప్ రెడ్డి, ఆర్ఐ శైలందర్, రామ కృష్ణ, ఎసై లు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని యోగా



## ప్రశాంతంగా ముగిసిన నీట్ పరీక్షలు

- జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్
- పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ ప్రతిమసింగ్
- 481అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 423 పరీక్షలకు హాజరు
- 58 అభ్యర్థులు వివిధ కారణాలతో గైర్హాజరు
- మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్





మెదక్, జూన్, 21(సిరి న్యూస్): మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన నీట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు కలెక్టర్ ప్రతిమాసింగ్ వెల్లడించారు.జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నీట్ ఆదివారం మెదక్ ప్రభుత్వ కళాశాలలో నిర్వహించగా పరీక్షా కేంద్రాన్ని అదనపు ఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ మెదక్ ఆర్డీవో రమాదేవి, తాసిల్దార్ లక్ష్మణ్ బాబు, డీఎస్పీ ప్రసన్నకుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ హుస్సేన్ , సంబంధిత అధికారులతో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీట్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి పటిష్ట ప్రణాళిక ద్వారా సమావేశాలు నిర్వహించుకుని వివిధ శాఖల అధికారులకు సూచనలు సలహాలు అందించడం జరిగిందన్నారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలవకుండా వసతులు కల్పించినట్లు వెల్లడించారు. పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు అభ్యర్థులను ప్రవేశ ద్వారం వద్ద తనిఖీలు నిర్వహించి లోపలికి అనుమతించడం జరిగిందన్నారు.పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ యంత్రాంగం 163 బి.ఎన్.ఎస్ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేసి పటిష్ట భద్రత నడుమ పరీక్షలు నిర్వహించినట్లు వివరించారు. 481 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉండగా కేవలం 421 మంది మాత్రమే పరీక్షకు హాజరైనట్టు వివరించారు. వివిధ కారణాల వల్ల 58 మంది గైర్హాజర్ కావడం జరిగిందన్నారు. నీట్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగినట్లు చెప్పారు.



### లోక్ అదాలత్‌లో అత్యధిక
## కేసులు పరిష్కారం

- సైబర్ బాధితులకు రూ.26.91 లక్షల రిఫండ్‌కు కోర్టు అనుమతి
- జాతీయ మెగా లోక్ అదాలత్‌లో 3,160 కేసుల పరిష్కారం
- రాష్ట్రంలో తొలి ఐదు స్థానాల్లో మెదక్ జిల్లా
- జిల్లా పోలీసుల పనితీరు అభినందనీయం :
- జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,

మెదక్, జూన్, 21(సిరి న్యూస్) : జాతీయ మెగా లోక్ అదాలత్‌లో మెదక్ జిల్లా రాష్ట్రవ్యాప్తంగా అత్యధిక కేసులను రాజీ ద్వారా పరిష్కరించి తొలి ఐదు స్థానాల్లో నిలిచిందని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన రాజీకి అవకాశం ఉన్న 925 ఐపీసీ/బీఎన్ఎస్ఎస్/ఎస్ఎల్ఎల్ కేసుల్లో ఇరు వర్గాల మధ్య రాజీ కుదిరినట్లు తెలిపారు. అలాగే 343 ఈపెట్టి కేసులు, 1,892 డీడీ కేసుల్లో అడ్మిషన్, జరిమానా ప్రక్రియ పూర్తయిందన్నారు. మొత్తంగా 3,160 కేసులు జాతీయ మెగా లోక్ అదాలత్ ద్వారా పరిష్కారమైనట్లు వెల్లడించారు. సైబర్ నేరాల బాధితులకు కూడా త్వరితగతిన న్యాయం జరిగేలా చర్యలు చేపట్టినట్లు ఎస్పీ తెలిపారు. 41 సైబర్ క్రైమ్ కేసుల్లో రూ.23,52,838, అలాగే ఎఫ్ఐఆర్ నమోదు కాని 41 ఫిర్యాదుల్లో రూ.3,39,000 బాధితులకు తిరిగి అందించేందుకు కోర్టు అనుమతి లభించినట్లు చెప్పారు. మొత్తంగా రూ.26,91,838 బాధితులకు తిరిగి అందనున్నట్లు వెల్లడించారు. ప్రజలను ఉద్దేశించి ఎస్పీ మాట్లాడుతూ, క్షణికావేశంలో జరిగే వివాదాలను శాశ్వత శత్రుత్వాలుగా మార్చుకోవద్దని సూచించారు. "రాజీ మార్గమే రాజమార్గం" అని పేర్కొంటూ, రాజీకి అవకాశం ఉన్న కేసుల్లో ఇరు వర్గాలు పరస్పర అవగాహనతో ముందుకు వచ్చి వివాదాలను పరిష్కరించుకోవాలని కోరారు. జాతీయ మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయడంలో కృషి చేసిన జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ అభినందించారు. సమన్వయంతో పనిచేసి ప్రజలకు త్వరితగతిన న్యాయం అందించడంలో విశేష కృషి చేశారని కొనియాడారు. జిల్లా పోలీసుల ఈ పనితీరు ప్రజల విశ్వాసాన్ని మరింత బలోపేతం చేస్తుందని ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు పేర్కొన్నారు.



# ఘనంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం..

రామచంద్రపురం (పటాన్‌చెరు), జూన్ 21, (సిరి న్యూస్): ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని పాశమైలారం గ్రామంలోని శ్రీ శ్రీ శ్రీ దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవ మహోత్సవాలు ఆదివారం భక్తి పారవశ్యంతో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. ఈ మహోత్సవాల్లో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకులు ఆమెకు వేద ఆశీర్వచనాలు అందించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖశాంతులు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# సారంగపల్లి కాలువ క్లియర్.. ముంపు ముప్పుకు బ్రేక్..

- సారంగపల్లి కాలువలో చెత్తతో నీటి ప్రవాహం అడ్డంకి..
- వర్షా నికి గ్రామంలోకి నీరు వచ్చే ప్రమాదం..
- జేసీబీతో పూడిక తీత చేపట్టిన సర్పంచ్ బచ్చలి రాములు..
- పిచ్చిమొక్కల తొలగింపుతో ప్రవాహం సాఫీ..

మంచిర్యాల జూన్ 21(సిరి న్యూస్): మంచిర్యాల జిల్లా, మందమర్రి మండలం సారంగపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని పార్కు పక్కన ఉన్న కాలువ గత కొంతకాలంగా తీవ్ర నిర్లక్ష్యానికి గురై చెత్తాచెదారం, మట్టి, వ్యర్థాలతో పూర్తిగా నిండిపోయింది. దీంతో వర్షాకాలంలో పరిస్థితి మరింత తీవ్రమై, చెరువు వైపు వెళ్లాల్సిన వర్షపు నీరు సక్రమంగా ప్రవహించకుండా అడ్డంకులు ఏర్పడి వెనక్కి తిరిగి గ్రామంలోకి చేరే ప్రమాదకర పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా గ్రామ ప్రజలు ప్రతి వర్షాకాలంలో నీటి నిల్వలు, ముంపు సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గమనించిన గ్రామ సర్పంచ్ బచ్చలి రాములు వెంటనే స్పందించి, పరిస్థితిని సమీక్షించి జేసీబీ సహాయంతో కాలువలో భారీ స్థాయిలో పూడిక తీత పనులను ప్రారంభించారు. కాలువలో పేరుకుపోయిన మట్టి, చెత్తను పూర్తిగా తొలగించడంతో పాటు, నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారిన ఇరుపక్కల పెరిగిన పిచ్చి మొక్కలను కూడా సమూలంగా తొలగించారు. దీంతో కాలువకు మళ్లీ సహజ ప్రవాహ మార్గం ఏర్పడింది. వర్షపు నీరు చెరువు వైపు సజావుగా వెళ్లేలా మార్గం సాఫీ కావడంతో, వర్షాకాలంలో ముంపు ప్రమాదం కొంతమేర తగ్గే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు. గతంలో చిన్న వర్షానికే నీరు నిలిచిపోవడంతో రోడ్లు, నివాస ప్రాంతాలు ముంపుకు గురయ్యే పరిస్థితి ఉండగా, ఈ చర్యతో ఆ సమస్యకు తాత్కాలిక ఉపశమనం లభించినట్లయింది. గ్రామంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ సమస్యపై తక్షణ చర్య తీసుకోవడం పట్ల స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాలువ నిర్వహణను నిరంతరం కొనసాగిస్తేనే శాశ్వత పరిష్కారం సాధ్యమవుతుందని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు.

# కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చికిత్సలు ప్రారంభించిన ఎంపీ

- ఆసుపత్రిలో పేరుకుపోయిన సమస్యలపై దృష్టి
- కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో సమస్యలు ఉండకూడదు
- ఆసుపత్రి అభివృద్ధికి నిధుల కేటాయింపు.
- ఆసుపత్రి ప్రాంగణాన్ని పూర్తిస్థాయిలో పరిశీలన
- 5 గంటల పాటు ఆసుపత్రిలో ఉండి, వినతి పత్రాలు స్వీకరణ
- డిజిటల్ సేవలు అందడం లేదంటూ ఫిర్యాదులు
- నెల రోజుల్లో.. త్వరలోనే డయాలసిస్ కేంద్రం
- మళ్లీ నెల తర్వాత వస్తా
- మెదక్ పార్లమెంటు సభ్యుడు మాధవనేని రఘునందన్ రావు





రామాయంపేట, జూన్ 21 (సిరి న్యూస్): రామాయంపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కు ఎంపీ మాధవనేని రఘునందన్ రావు చికిత్సలు ప్రారంభించారు. ఎంతోకాలంగా పేరుకుపోయిన సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఆదివారం నాడు ఆయన స్వయంగా రామాయంపేట ప్రభుత్వ చేరుకున్నారు. సుమారు ఐదు గంటల పాటు ఆసుపత్రిలోనే ఉండి, అన్ని వర్గాల ప్రజలను వినతి పత్రాలు స్వీకరించారు. ఆసుపత్రిలో సంవత్సరాలుగా పేరుకుపోయిన సమస్యలను పరిష్కరిస్తాం అన్నారు. 2018 సంవత్సరంలో ప్రారంభమైన ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో ప్రజలకు సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని గ్రహించిన ఎంపీ రఘునందన్ రావు తన సొంత నిధులతో ఆసుపత్రి అభివృద్ధికి నిధులు కేటాయించారు. ఆదివారం ఎంపీ రఘునందన్ రావు కూతురు సింధు మాధవనేని ఆధ్వర్యంలో చేపట్టిన ఉచిత క్యాన్సర్ స్కానింగ్ క్యాంపును ఎంపీ రఘునందన్ రావు ప్రారంభించారు. అనంతరం రామాయపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి ప్రాంగణాన్ని పూర్తిస్థాయిలో పరిశీలించిన ఎంపీ రఘునందన్ రావు ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ లింబాద్రి ఆసుపత్రిలో నెలకున్న సమస్యలపై ఎంపీ రఘునందన్ రావు దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా కమ్యూనిటీ హెల్త్ సెంటర్ లో దంత వైద్యులు ఉన్నప్పటికీ డెంటల్ చైర్ లేకపోవడంతో ప్రజలకు సేవలు అందడం లేదని, ఎక్స్రే మిషన్ ఉన్నప్పటికీ డిజిటల్ సేవలు అందడం లేదని ఎంపీ రఘునందన్ రావు దృష్టికి తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఎంపీ రఘునందన్ రావు తన సొంత నిధుల ద్వారా సుమారు మూడు లక్షల 50 వేల రూపాయలు విలువగల డిజిటల్ ఎక్సరే మిషిన్, రెండున్నర లక్షల విలువగల డెంటల్ చైర్ ను మంజూరు చేశారు, ఆసుపత్రికి వచ్చిన రోగులకు మినరల్ వాటర్ అందడం లేదని ఎంపీ రఘునందన్ రావు దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించారు తన నిధుల ద్వారా వాటర్ ప్యూరిఫై మంజూరు చేశారు, రోగులకు అందజేసే ఆహారాన్ని తయారు చేసేందుకు కిచెన్ షెడ్ లేదని ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఎంపీ రఘునందన్ రావు కిచెన్ షెడ్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. మరోవైపు 2018 సంవత్సరంలో అధునాతన హంగులతో నిర్మాణం చేపట్టిన ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ కేంద్రం లేక రోగులు ఇబ్బంది పడుతున్నారని ఆయన దృష్టికి తీసుకెళ్లగా సకాలంలో స్పందించిన ఎంపీ రఘునందన్ రావు వెంటనే డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ కు విజ్ఞప్తి చేశారు, మరోవైపు ఆసుపత్రి ప్రాంగణంలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామని, నెల రోజుల్లోపు రోగులకు డయాలసిస్ కేంద్రం అందుబాటులోకి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రికి కేవలం నిరుపేదలు మాత్రమే వస్తారని, వారికి అన్ని రకాల వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని ఎంపీ రఘునందన్ రావు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు శీలం అవినాష్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు వాలిదాస్ మల్లేష్ గౌడ్ ,జిల్లా మాజీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి చినమైన శ్రీనివాస్ ,జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి mln రెడ్డి, జిల్లా మహిళ అధ్యక్షురాలు మల్లికా, మండల అధ్యక్షులు నవీన్ గౌడ్ కౌన్సిలర్ శంకర్ గౌడ్, సర్పంచులు అక్కన్నపేట బక్క యాదగిరి, దంతపల్లి సర్పంచ్ బాలరాజ్ , పట్టణ అధ్యక్షులు సీనియర్ నాయకులు వెలుమల సిద్ధరాములు ,భానుచందర్, పబ్బ సత్యం ఓలిశె దామోదర్ పోచమ్మల కన్నయ్య సత్యం దోమకొండ రాములు గోపిశెట్టి రమణ నిమ్మల సామి నాగరాజు సంతోష్‌నితిన్ బసం అనిల్ కార్యకర్తలు పాల్గొన్నారు



# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు

- వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగా డే వేడుకలు.



రామాయంపేట, జూన్ 21 (సిరి న్యూస్): 12వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని రామాయంపేట మండల వ్యాప్తంగా యోగా తరగతులు నిర్వహించామని ఆయుష్ యోగ శిక్షకులు, జాతీయస్థాయి యోగా ప్రదర్శన కారులు మద్దెల భరత్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా దాదాపు 3000 మందికి యోగ శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. భారతీయ సంస్కృతిలో భాగమైన యోగా...నేడు విశ్వవ్యాప్తమైందన్నారు. సరిహద్దులు దాటి... ప్రపంచ దేశాలన్నింటినీ ఒకే తాటిపైకి తెచ్చి ప్రతి ఏటా జూన్ 21న ప్రపంచవ్యాప్తంగా కోట్ల మంది యోగాసనాలతో రోజును ప్రారంభిస్తున్నారన్నారు. శరీరానికి ధృడత్వాన్ని, మనస్సుకు ప్రశాంతతను ఇచ్చే ఈ ప్రాచీన విద్య ప్రాధాన్యతను ఐక్యరాజ్యసమితి గుర్తించి దశాబ్ద కాలం దాటిందనీ.. అప్పటి నుంచి ఇప్పటివరకు యోగా క్రేజ్ వరల్డ్ వైడ్ గా నానాటికీ పెరుగుతూనే ఉందన్నారు. కార్యక్రమాలను విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.

**వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...**

రామాయంపేట మండల కేంద్రంలో ఆదివారం ప్రపంచ యోగా దినోత్సవం పురస్కరించుకొని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యోగ డే వేడుకలు నిర్వహించారు. స్థానిక ప్రభుత్వ పాఠశాల మైదానంలో ఏర్పాటుచేసిన యోగా డే వేడుకల్లో వాకర్ అసోసియేషన్ సభ్యులు, యోగ శిక్షకులు పాల్గొన్నారు. యోగాసనాలు, సూర్య నమస్కారాలు చేసి యోగ పై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రతిరోజు యోగా సాధన చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని ఈ సందర్భంగా యోగా శిక్షకులు మద్దెల భరత్ సూచించారు. నిత్యజీవితంలో ప్రతి ఒక్కరు యోగాను ఒక భాగస్వామ్యం చేసుకోవాలని, గంటపాటు యోగాసనాలు వేయాలని ఈ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బిజెపి కౌన్సిలర్ జంగంపల్లి శంకర్ గౌడ్ పాల్గొన్నారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ భారత దేశ ప్రజలు ఆరోగ్యంగా ఉండాలని యోగ పై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచనతో ప్రపంచ దేశాలు సైతం యోగాను ఆదరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు గంటపాటు యోగాసనాలు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు రామ్ రెడ్డి, కార్యదర్శి మధురాలో స్వామి గౌడ్, తో పాటు వాకర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



# ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయం


- తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి ప్రదాత జయశంకర్ సార్ కు ఘన నివాళి.
- పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు



మెదక్, జూన్, 21(సిరి న్యూస్) : తెలంగాణ ఉద్యమానికి స్ఫూర్తి ప్రదాతగా నిలిచిన జయశంకర్ సార్ సేవలు చిరస్మరణీయమని పట్టణ పార్టీ కన్వీనర్ కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు పేర్కొన్నారు. తెలంగాణ సిద్ధాంతకర్త,ఉద్యమ మేధావి ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని మెదక్ జిల్లా బీఆర్ఎస్ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి బిఆర్ఎస్ శ్రేణులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఆయన చేసిన త్యాగాలు, అందించిన సిద్ధాంతపరమైన మార్గదర్శకత్వం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ సేవలు తెలంగాణ సమాజం ఎన్నటికీ మరువలేనివని పేర్కొన్నారు.ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణకు జరిగిన అన్యాయాలను ప్రజలకు వివరించి, ప్రత్యేక రాష్ట్ర అవసరాన్ని బలంగా వినిపిస్తూ ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లో రగిలించిన మహనీయుడు జయశంకర్ అని కొనియాడారు. ఆయన ఆశయాల ఫలితంగానే తెలంగాణ రాష్ట్రం ఏర్పడి, నేడు దేశానికే ఆదర్శంగా అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనే శ్వాసగా, ధ్యాసగా జీవించిన జయశంకర్ సార్ పోరాటం, జీవితం యువతకు ఆదర్శమని పేర్కొన్నారు. తెలంగాణ ప్రాంత ప్రజల హక్కుల కోసం, "మన నీళ్లు - మన నిధులు - మన ఉద్యోగాలు" అనే నినాదంతో ఉద్యమాన్ని బలోపేతం చేసిన ప్రముఖుల్లో జయశంకర్ సార్ ముందువరుసలో నిలిచారని తెలిపారు.తెలంగాణ ఉద్యమంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ గారితోతో కలిసి కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అకిరెడ్డి. కృష్ణారెడ్డి, పట్టణ పార్టీ కోకన్వీనర్ గడ్డమీది. క్రిష్ణ గౌడ్, కౌన్సిలర్ దీపక్ కుమార్, మాజీ కౌన్సిలర్ మాయ.మల్లేశం, నాయకులు ఏనుగుల రాజు, ఇస్మాయిల్, సునీల్,బబ్లు, రవి,వేణు తదితరులు పాల్గొన్నారు.





# నల్ల పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలి

- మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం.పద్మా దేవేందర్ రెడ్డి
- మెదక్ లో మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నల్ల పోచమ్మ తల్లి బోనాలు.

మెదక్, జూన్, 21(సిరి న్యూస్): నల్ల పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మా దేవేందర్ రెడ్డి ఆకాంక్షించారు. మెదక్ జిల్లా కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో 20వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం శ్రీమాత నల్ల పోచమ్మ తల్లికి బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో పద్మా దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ శ్రేణులతో కలిసి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మహిళలతో కలిసి పద్మ దేవేందర్ రెడ్డి బోనం ఎత్తుకున్నారు.అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించడం ఆనందదాయకమని అన్నారు. నల్ల పోచమ్మ తల్లి కటాక్షంతో ప్రజల జీవితాల్లో సుఖశాంతులు నెలకొనాలని కోరుకున్నారు. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో భక్తి భావంతో బోనాలు సమర్పించడం తెలంగాణ సంస్కృతి వైభవాన్ని ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు. సమాజంలో ఐక్యత, సాంస్కృతిక విలువల పరిరక్షణతో పాటు ఆధ్యాత్మిక చైతన్యం పెంపొందించడంలో ఇటువంటి ఉత్సవాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో 20వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన బోనాల ఉత్సవాలు అత్యంత వైభవంగా జరగడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ బోనాల ఉత్సవాల్లో యువ న్యాయవాది జీవన్ రావు, మున్సిపల్ కౌన్సిలర్లు బట్టి.ఉదయ్ కుమార్,దీపక్ కుమార్,జుబేర్ అహ్మద్,సోహెల్,మాజీ కౌన్సిలర్లు మెంగాని.విజయలక్ష్మి,బట్టి.లలిత నాయకులు గడ్డమీద కృష్ణ గౌడ్ ప్రభురెడ్డి,గట్టేష్,కృష్ణ,ఇందాద్, సాయి, మున్నూరు కాపు సంఘం సభ్యులు, మహిళలు, యువతతో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



# ఘనంగా నల్ల పోచమ్మ కు బోనాలు

వెల్దుర్తి,జూన్ 20 (సిరి న్యూస్): వెల్దుర్తి మండలం బస్వాపూర్ గ్రామంలో జరుగుతున్న నల్ల పోచమ్మ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పూజా కార్యక్రమాలను అమ్మవారికి ఓడిబియాలు, సమర్పించారు. అంతేకాకుండా గ్రామంలో ఉన్న గ్రామ దేవతలకు మహిళలు బోనాలు నిర్వహించరు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నర్సాపూర్ ఇంచార్జ్ ఆవుల రాజి రెడ్డి అమ్మవారిని దర్శించుకొని అనంతరం మాట్లాడుతూ పోచమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వర్షాలు సమృద్ధిగా పడి పంటలు బాగా పండాలని వారు అమ్మవారిని కోరుకున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, మహేష్ రెడ్డి, సుధాకర్ గౌడ్, తలారి మల్లేష్, ముక్తా బాయ్, మల్లేశం చారి,ఉప సర్పంచ్ మల్లేష్‌గౌడ్, శేఖర్,రమేష్‌గౌడ్, సింహం,తదితరులు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.






# భారతీనగర్‌లో ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు

- పాల్గొన్న మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి

రామచంద్రపురం, జూన్ 21, (సిరి న్యూస్): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఓల్డ్ ఎంఐజీ కాలనీలో శ్రీ వాణి విద్యానికేతన్ పాఠశాల సమీపంలో ఫ్యూజన్ ఫిట్‌నెస్ స్టూడియో ఆధ్వర్యంలో ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై యోగా సాధన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతతను అందిస్తుందని, ప్రతి ఒక్కరూ యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సూచించారు. ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఉత్తమ మార్గమని పేర్కొన్నారు. ఫ్యూజన్ ఫిట్‌నెస్ స్టూడియో ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అన్ని వయసుల వారు ఉత్సాహంగా పాల్గొని వివిధ యోగా ఆసనాలు, శ్వాస వ్యాయామాలు చేశారు. భాస్కర్ ముదిరాజ్, మణి, తిలావత్, రాకేష్ రెడ్డి, పవన్‌తో పాటు పలువురు యోగా ప్రేమికులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించిన నిర్వాహకులను పలువురు అభినందించారు.

# ఖరీఫ్ ధాన్యం ప్రతి గింజ కొనాల్సిందే



- కేంద్రాన్ని సాకుగా చూపితే ఊరుకునే ప్రసక్తే లేదు.
- అవసరమైతే ప్రభుత్వ మెడలు వంచుతాం
- బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంఠరెడ్డి.తిరుపతిరెడ్డి

మెదక్, జూన్, 21(సిరిన్యూస్): ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ప్రతి ధాన్యం గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాల్సిందేనని, కేంద్ర ప్రభుత్వాన్ని సాకుగా చూపి బాధ్యతల నుంచి తప్పించుకోవాలని చూస్తే బీఆర్ఎస్ పార్టీ తీవ్ర స్థాయిలో ఉద్యమిస్తుందని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంఠరెడ్డి తిరుపతిరెడ్డి హెచ్చరించారు. ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ..గత రెండేళ్లుగా ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బందులకు గురిచేసిన కాంగ్రెస్ ప్రభుత్వం ఈసారి పూర్తిగా చేతులెత్తివేసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ధాన్యం కొనుగోలు విషయంలో రైతులకు అన్యాయం జరిగితే ప్రభుత్వ యంత్రాంగాన్ని స్తంభింపజేసేలా ఆందోళనలు చేపడతామని, ప్రతి గింజ కొనుగోలు అయ్యే వరకు తెలంగాణ రైతాంగానికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు. అవసరమైతే తెలంగాణను స్తంభింపజేసి ప్రభుత్వ మెడలు వంచి ధాన్యం కొనుగోలు చేయించేలా ఉద్యమిస్తామని హెచ్చరించారు.ఎన్నికల ముందు రైతుబంధు ఎకరాకు రూ.12 వేలుగా పెంచుతామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ ఆ హామీని అమలు చేయలేదని ఆరోపించారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కేంద్రం కొనకపోయినా రాష్ట్ర ప్రభుత్వమే ధాన్యం కొనాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్ నాయకులు, నేడు కేంద్రాన్ని సాకుగా చూపడం వారి దివాళాకోరుతనానికి నిదర్శనమన్నారు. సన్నధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి రైతులను మోసం చేశారని విమర్శించారు. రైతులు పండించిన పంటను పూర్తిగా కొనుగోలు చేసే దమ్ము లేకపోయినా, కొన్ని రకాల వరి ధాన్యాలనే పండించాలని సూచించడం రైతులకు నష్టం కలిగించే చర్య అని పేర్కొన్నారు. తక్కువ దిగుబడి వచ్చే రకాల వైపు రైతులను మళ్లించడం ద్వారా కొనుగోలు భారం తగ్గించుకోవాలనే ప్రయత్నం జరుగుతోందన్నారు.బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో రైతుబంధు, రైతు బీమా, 24 గంటల ఉచిత విద్యుత్, మిషన్ కాకతీయ, కాళేశ్వరం వంటి పథకాల ద్వారా వ్యవసాయ రంగానికి పెద్దపీట వేశామని గుర్తు చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమంపై దృష్టి సారించి తన వైఖరిని మార్చుకోవాలని,లేకపోతే రైతుల నుంచి భారీ వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



# మెడికల్ కళాశాలలో ఎమ్మెల్యే పర్యటన..

- మెడికల్ కళాశాలలో ఎమ్మెల్యే ఆకస్మిక పర్యటన..
- విద్యార్థులతో ముఖాముఖి.. సమస్యలపై ఆరా..
- అన్ని సమస్యలు పరిష్కరిస్తానంటూ భరోసా..
- వసతుల మెరుగుదలపై అధికారులకు సూచనలు..




**మంచిర్యాల, జూన్ 21 (సిరి న్యూస్):** నూతనంగా ప్రారంభమైన ప్రభుత్వ వైద్య కళాశాల ల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు స్పష్టం చేశారు. భవిష్యత్ వైద్యులుగా తీర్చిదిద్దబడుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. విద్యార్థుల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని గుడిపేటలో ఇటీవల ప్రారంభమైన ప్రభుత్వ వైద్య కళాశాలను శనివారం ఎమ్మెల్యే సందర్శించారు. కళాశాలలోని తరగతి గదులు, ప్రయోగశాలలు, వసతి గృహాలు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ప్రత్యేకంగా సమావేశమై వారి అభిప్రాయాలు, సమస్యలు, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు వసతి, తాగునీరు, రవాణా, విద్యా సామగ్రి, ఇతర సౌకర్యాలకు సంబంధించిన అంశాలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులతో చర్చించి తక్షణ చర్యలు తీసుకునేలా చూస్తామని తెలిపారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఎటువంటి ఆటంకం కలగకుండా అన్ని విధాలుగా సహకరిస్తామని భరోసా కల్పించారు. ప్రభుత్వ వైద్య కళాశాలలు రాష్ట్ర ఆరోగ్య రంగానికి బలమైన పునాదులుగా నిలవాలని, ఇక్కడ చదువుతున్న విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే సూచించారు. విద్యార్థుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. కళాశాలకు చేరుకున్న ఎమ్మెల్యేకు అధ్యాపకులు, విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కళాశాల అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై ప్రజాప్రతినిధులు, అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో మేయర్ ధర్ని మధుకర్, డిప్యూటీ మేయర్ సల్ల రమ్య, మహేష్, టీపీసీసీ ఉపాధ్యక్షుడు చిట్లా సత్యనారాయణ, కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## అండర్ డ్రైనేజ్ పనులు నిలిచిపోవడంతో
# ప్రజలకు తీవ్ర ఇబ్బందులు

(సిరి న్యూస్) కొండాపూర్, జూన్ 21: మునిదేవుని పల్లి ఓ కాలనీ లో అండర్ డ్రైనేజ్ పనులు మధ్యలోనే ఆగిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డ్రైనేజ్ లైన్లు పూర్తి కాకపోవడంతో మురుగునీరు రోడ్లపై నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. దీంతో పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలు అసౌకర్యానికి గురవుతున్నారు. మురుగు నీటి నిల్వల కారణంగా దోమలు పెరిగి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు ఆరోగ్య సమస్యలను ఎదుర్కొనే పరిస్థితి నెలకొంది. పనులు నిలిచిపోయిన ప్రాంతాల్లో కాలనిలో కూడా దెబ్బతిని రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ



సమస్య పరిష్కారం కాలేదని ప్రజలు చెబుతున్నారు. అండర్ డ్రైనేజ్ పనులను వెంటనే పునఃప్రారంభించి, మురుగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు. అధికారులు స్పందించి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



## బీహెచ్ఈఎల్ హెచ్‌పీఈపీలో
# యోగా దినోత్సవ వేడుకలు

రామచంద్రపురం, జూన్ 21, (సిరి న్యూస్): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని బీహెచ్ఈఎల్ హెచ్‌పీఈపీలో ఆదివారం అత్యంత ఉత్సాహంగా యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ (శ్రీ రామ చంద్ర మిషన్)లో ప్రత్యేక యోగా సెషన్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హెచ్‌పీఈపీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వై. శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. జీఎం (హెచ్‌ఆర్, టీఏ, సీ&పీఆర్, మెడికల్) డాక్టర్ సంధ్యా కార్, జీఎం (పంప్స్ అండ్ ఐఈ) రఘునాథ్ ఎస్. మెటేరే తదితర సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగా ఎంతో అవసరమని తెలిపారు. వృత్తిపరమైన, వ్యక్తిగత జీవితాల మధ్య సమతుల్యతను కాపాడుకోవడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రతిరోజూ యోగాను అలవాటు చేసుకోవాలని సూచించారు.




# పటాన్‌చెరులో ఘనంగా యోగా దినోత్సవ వేడుకలు

రామచంద్రపురం (పటాన్‌చెరు), జూన్ 21, (సిరి న్యూస్): అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని పటాన్‌చెరు మైత్రి మైదానంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. వందలాది మంది విద్యార్థులు, ప్రజలు, అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొని సామూహిక యోగా కార్యక్రమంలో పాల్గొన్నారు. పతంజలి యోగ సమితి శిక్షకుల ఆధ్వర్యంలో రెండున్నర గంటల పాటు వివిధ యోగా భంగిమలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ యోగాను ప్రతి ఒక్కరూ దినచర్యలో భాగం చేసుకోవాలని, ఆరోగ్యకరమైన జీవనశైలికి యోగ ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. సమాజంలో పెరుగుతున్న డ్రగ్స్ సంస్కృతిని నిర్మూలించేందుకు అందరూ బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ప్రొఫెసర్ జయశంకర్ వర్ధంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఐశ్వర్య నృత్యాలయం ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను సన్మానించారు. కార్యక్రమంలో సీఐ వినాయక్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, యోగా సమితి సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రొఫెసర్ జయశంకర్‌కు ఘన నివాళులు

రామచంద్రపురం, జూన్ 21, (సిరి న్యూస్): తెలంగాణ ఉద్యమ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ సార్ 15వ వర్ధంతి సందర్భంగా భారతీనగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీమతి సింధు ఆదర్శ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ సాధన కోసం జీవితాంతం కృషి చేసిన ప్రొఫెసర్ జయశంకర్ సేవలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో ఆయన పోషించిన పాత్రను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో రామచంద్రాపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య యాదవ్, బీఆర్ఎస్ నాయకులు కుమార్ గౌడ్, పరమేష్ యాదవ్, భాస్కర్ ముదిరాజ్, నర్సింహ, రాణి యాదవ్, దేవేంద్ర చారి, శ్రీకాంత్ రెడ్డి, కుతుబుద్దీన్, పాపయ్య, రమేష్, అప్పల భాస్కర్, సాయిబాబా, గణేష్ తదితరులు పాల్గొన్నారు.





## ప్రయాణికులకు అలర్ట్..

# అమల్లోకి రైల్వే కొత్త రూల్స్!

టికెట్ లేకుండా లేదా చెల్లుబాటు కాని టికెట్‌తో ప్రయాణించే ప్రయాణికులపై మరింత కఠినమైన చర్యలు తీసుకోవడానికి ఇండియన్ రైల్వే సిద్ధమైంది. జన్ విశ్వాస్ చట్టం ప్రకారం కొత్త రూల్స్ జులై 1నుంచి అమల్లోకి రానున్నట్లు భారతీయ రైల్వే వెల్లడించింది.కొత్త నిబంధనల ప్రకారం, టికెట్ లేకుండా ప్రయాణిస్తే ఇకపై కనీస జరిమానా రూ.250 నుంచి రూ.500కు పెంచారు. అంటే, ఎవరైనా సరైన టికెట్ లేకుండా ప్రయాణిస్తే వారికి టికెట్ ఛార్జీతో పాటు అదనంగా కనీసం రూ.500 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఈ నిబంధన తప్పుడు టికెట్‌తో ప్రయాణించేవారికి కూడా వర్తిస్తుంది.అంతేకాకుండా.. టికెట్‌లో పేర్కొన్న కోచ్ లేదా క్లాస్ కాకుండా ఇతర కోచ్‌లో ప్రయాణిస్తే కూడా జరిమానా విధించడం జరుగుతుంది. ఉదాహరణకు, జనరల్ టికెట్‌తో స్లీపర్ లేదా ఏసీ కోచ్‌లో ప్రయాణించడం, లేదా అనుమతించిన దూరం (దిగాల్సిన స్టేషన్) కంటే ఎక్కువ ప్రయాణించడం వంటి వాటిపై కూడా అదనపు చార్జీలు విధిస్తారు.మరో ముఖ్యమైన విషయం ఏమిటంటే.. ఇతరుల టికెట్‌ను ఉపయోగించి ప్రయాణించడం కూడా నేరంగా పరిగణించడం జరుగుతుంది. ఇలా ప్రయాణిస్తే.. టికెట్ రద్దు చేయడమే కాకుండా, రూ.500 జరిమానా కూడా విధిస్తారు. ఒకవేళ ప్రయాణికుడు ఈ జరిమానాలు చెల్లించడానికి నిరాకరిస్తే, రైల్వే అధికారులు కోర్టులో కేసు వేయవచ్చు. అప్పుడు కోర్టు ఆదేశాల ప్రకారం బకాయిలు వసూలు చేయడం జరుగుతుంది.ప్రయాణికుల్లో అవగాహన పెంచాలని లక్ష్యంతో ఈ కొత్త నిబంధనలను రైల్వే శాఖ ప్రవేశపెట్టనుంది. ఈ నేపథ్యంలో పశ్చిమ రైల్వే, మధ్య రైల్వే వంటి విభాగాలు సోషల్ మీడియా, ఇతర ప్రకటనల ద్వారా ప్రజలకు హెచ్చరికలు జారీ చేశాయి. సరైన టికెట్‌తో మాత్రమే ప్రయాణించాలని, రైల్వే నియమాలను తప్పకుండా పాటించాలని సూచిస్తున్నాయి.



## సంపదలో సగం

# సమాజానికే ఇవ్వండి

**ఇటీవల స్పేస్‌ఎక్స్ ఐపీఓ విజయవంతంగా పూర్తికావడంతో ఎందోమంది కోటీశ్వరులు, బిలియనీర్లుగా మారారు. భవిష్యత్తులో ఓపెన్‌ఏఐ, ఆంత్రోపిక్ వంటి ప్రముఖ టెక్ కంపెనీలు కూడా ఐపీఓకు వచ్చే అవకాశాలు ఉండటంతో మరింత మంది ధనవంతులు అవుతారని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ప్రపంచ ప్రఖ్యాత దాతృత్వవేత్త 'మెలిండా ఫ్రెంచ్ గేట్స్' ఓ కీలక సందేశాన్ని ఇచ్చారు.**

మెలిండా ఫ్రెంచ్ గేట్స్ అభిప్రాయం ప్రకారం.. పెద్ద మొత్తంలో సంపద సంపాదించే అవకాశం లభించినవారు తమ సంపదలో కనీసం సగం భాగాన్ని సమాజానికి తిరిగి ఇవ్వాలని ఇప్పటి నుంచే నిర్ణయించుకోవాలి. ఐపీఓల ద్వారా కోట్లాది డాలర్ల సంపద పొందగలిగే స్థితిలో ఉన్న వారికి, అదే స్థాయిలో దానం చేసే సామర్థ్యం కూడా ఉంటుందని ఆమె పేర్కొన్నారు. సంపద అనేది కేవలం వ్యక్తిగత విజయానికి గుర్తు మాత్రమే కాదు, సమాజం పట్ల ఉన్న బాధ్యతకు కూడా ప్రతీక అని ఆమె పేర్కొన్నారు.అమెరికాలో బిలియనీర్లుగా ఎదిగిన వారు దేశం అందించిన అవకాశాలను గుర్తుంచుకోవాలని మెలిండా సూచించారు. మంచి విద్యా వ్యవస్థ, ఆరోగ్య సేవలు, రహదారులు, సమాచార మౌలిక వసతులు వంటి ప్రజా వనరుల వల్లే పెద్ద కంపెనీలు అభివృద్ధి చెందగలిగాయని ఆమె వివరించారు. అందువల్ల సమాజం నుంచి లభించిన అవకాశాలను తిరిగి సమాజ అభివృద్ధికే ఉపయోగించాల్సిన బాధ్యత ధనవంతులపై ఉందని ఆమె చెప్పారు. మెలిండా ఫ్రెంచ్ గేట్స్ వ్యక్తిగత సంపద సుమారు 19 బిలియన్ డాలర్లుగా అంచనా. ఆమె 2010లో వారెన్ బఫెట్, ఆమె మాజీ భర్త బిల్ గేట్స్‌తో కలిసి గివింగ్ ప్లెడ్జ్ అనే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రపంచంలోని అత్యంత ధనవంతులు తమ సంపదలో ఎక్కువ భాగాన్ని జీవితకాలంలో గానీ, మరణానంతరం గానీ దానం చేయాలని ప్రతిజ్ఞ చేస్తారు. ఇప్పటివరకు 250 మందికి పైగా ప్రముఖ దాతలు ఈ కార్యక్రమంలో చేరారు. వీరిలో మెకెంజీ స్కాట్, కాన్వా సహ వ్యవస్థాపకులు మెలానీ పెర్కిన్స్, క్లిఫ్ ఓబ్రెచ్ట్, ఎయిర్‌బీఎన్‌బీ సహ వ్యవస్థాపకుడు బ్రియాన్ చెస్కీ వంటి ప్రముఖులు ఉన్నారు.గేట్స్ ఫౌండేషన్ నుంచి వైదొలిగిన తరువాత, మెలిండా తన స్వతంత్ర సంస్థ పివోటల్ ద్వారా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఇటీవల మహిళల మధ్యవయస్సు ఆరోగ్యం, మెనోపాజ్ సంబంధిత సమస్యల కోసం 215 మిలియన్ డాలర్ల నిధులను ప్రకటించారు.ధనవంతుల ప్రవర్తన గురించి అడిగినప్పుడు, సంపదను ఆడంబరంగా ప్రదర్శించడం తనకు నచ్చదని మెలిండా స్పష్టం చేశారు. అవసరమైన మంచి వస్తువులు కొనుగోలు చేయడంలో తప్పేమీ లేదు, కానీ సంపదను ప్రదర్శిస్తూ ఇతరులను ఆకర్షించే ప్రయత్నం చేయడం సమాజానికి ఎలాంటి మేలు చేయదని ఆమె అభిప్రాయపడ్డారు.

## ఏఐ టాలెంట్‌కు

# కొత్త కేంద్రంగా భారత్




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రంగంలో భారత్ మరో కీలక మైలురాయిని చేరుకుంది. బోస్టన్ కన్సల్టింగ్ గ్రూప్ (బీసీజీ) తాజా అధ్యయనం ప్రకారం, 2025లో ప్రపంచవ్యాప్తంగా ఏఐ టాలెంట్‌ను ఆకర్షించడంలో భారత్ అత్యంత వేగంగా ఎదిగిన దేశంగా నిలిచింది. ప్రస్తుతం ప్రపంచ ఏఐ టాలెంట్‌లో సుమారు 6 శాతం వాటాను కలిగి ఉన్న భారత్, అమెరికా, బ్రిటన్‌లతో కలిసి ఏఐ ప్రొఫెషనల్స్‌కు అత్యంత ప్రాధాన్య గమ్యస్థానాల జాబితాలో టాప్3లో చోటు దక్కించుకుంది. ఈ ఏడాది మాత్రమే భారత్ తన ఏఐ టాలెంట్ వాటాను 1.3 శాతం పాయింట్లు పెంచుకోవడం విశేషం. స్టెమ్ (సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్) ప్రొఫెషనల్స్ విషయంలో కూడా దాదాపు 7 శాతం వాటాతో ప్రపంచ అగ్రగామి కేంద్రాల్లో ఒకటిగా నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా అత్యంత నైపుణ్యం కలిగిన ప్రొఫెషనల్స్ వలసలు తగ్గుతున్న సమయంలో భారత్ ఈ పురోగతి సాధించడం మరింత ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. బీసీజీ విశ్లేషణ ప్రకారం, విదేశాలకు వెళ్లిన నైపుణ్యం కలిగిన ప్రవాస భారతీయులు (ఎన్ఆర్ఐ) ఇప్పుడు దేశంలో పెరుగుతున్న అవకాశాలను చూసి తిరిగి 'స్వదేశానికి' వచ్చేస్తుండటంతో అన్ని విభాగాల్లోనూ భారత్ తన వాటాను పెంచుకుంది. దేశీయ టెక్ ఎకోసిస్టమ్ విస్తరించడం, ఏఐ రంగంలో భారీ పెట్టుబడులు పెరగడం ఈ ధోరణికి ప్రధాన కారణాలుగా కనిపిస్తున్నాయి. దీనివల్ల అటు రీసెర్చ్ విభాగంలో 0.3 శాతం, ఇటు స్టెమ్ విభాగంలో 0.7 శాతం చొప్పున భారత్ తన ప్రతిభావంతుల సంఖ్యను పటిష్టం చేసుకుంది. ఒక సాంకేతికతలో టాలెంట్ ఎక్కువగా ఉన్న దేశాలే భవిష్యత్తులో ఆ టెక్నాలజీ మార్కెట్‌ను శాసించే అవకాశం 17 రెట్లు ఎక్కువగా ఉంటుందని బీసీజీ స్పష్టం చేసింది. ప్రస్తుతం టెక్ విభాగంలో అమెరికా లీడింగ్‌లో ఉన్నప్పటికీ, ఏఐ టాలెంట్ విషయంలో భారత్ చూపిస్తున్న ఈ దూకుడు రాబోయే దశాబ్దపు ప్రపంచ టెక్నాలజీ యుద్ధంలో గేమ్ ఛేంజర్‌గా మారబోతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.

# బ్యాంకుల డిజిటల్ మాయాజాలానికి బ్రేక్

**జూన్ 15న ఆర్‌బీఐ జారీ చేసిన సరికొత్త సవరణల ప్రకారం, బ్యాంకులు, వాటి ఏజెంట్లు కస్టమర్ల ప్రమేయం లేకుండా, వారిని భయపెట్టి లేదా గందరగోళపరిచి ప్రయోజనం పొందడాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించింది.**

బ్యాంకుల డిజిటల్ మాయాజాలానికి బ్రేక్

మీరు బ్యాంక్ యాప్ ఓపెన్ చేయగానే లోన్ తీసుకోమంటూ విసిగించే పాప్‌అప్‌లు, వద్దన్నా అకౌంట్‌లో యాడ్ అయిపోయే అనవసర ఇన్సూరెన్స్‌లు, క్రెడిట్ కార్డ్ రద్దు చేయాలంటే కనిపించకుండా దాచేసే ఆప్షన్లు.. ఇలాంటి అనుభవాలు చాలామందికి ఎదురయ్యాయి. ఇప్పటివరకు ఇవి మార్కెటింగ్ ట్రిక్స్‌గా పరిగణించేవారు. ఇకపై ఇలాంటి పద్ధతులు కుదరవు. డిజిటల్ బ్యాంకింగ్‌లో కస్టమర్లను తప్పుదోవ పట్టించే 'డార్క్ ప్యాటర్న్స్' (మోసపూరిత డిజైన్ల)కు భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) గట్టి బ్రేక్ వేసింది. జూన్ 15న ఆర్‌బీఐ జారీ చేసిన సరికొత్త సవరణల ప్రకారం, బ్యాంకులు, వాటి ఏజెంట్లు కస్టమర్ల ప్రమేయం లేకుండా, వారిని భయపెట్టి లేదా గందరగోళపరిచి ప్రయోజనం పొందడాన్ని చట్టవిరుద్ధంగా ప్రకటించింది. దీనికోసం ప్రత్యేకంగా 11 రకాల డిజిటల్ ట్రిక్కుల(డార్క్ ప్యాటర్న్స్)ను బ్లాక్ లిస్ట్‌లో పెట్టింది. బ్యాంకులు తమ యాప్స్, వెబ్‌సైట్లను ఆడిట్ చేసుకుని, ఈ మోసపూరిత డిజైన్లను తొలగించడానికి 2027, జనవరి 1 వరకు డెడ్‌లైన్ విధించింది. ఆ తర్వాత కూడా ఏ బ్యాంకైనా ఈ పద్ధతులు పాటిస్తే కస్టమర్లు నేరుగా ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌కు ఫిర్యాదు చేయవచ్చు.

వినియోగదారులను తప్పుదారి పట్టించేలా ప్లాట్‌ఫామ్స్ రివ్యూలలో ఫేక్ ఎమర్జెన్సీ అలర్ట్స్ ఇవ్వడం, నెగెటివ్ రివ్యూలను కనబడకుండా చేయడం, సబ్‌స్క్రిప్షన్ ట్రాపింగ్, తప్పుడు ధరలతో ఆఫర్లు చూపించడం లాంటి వాటిని డార్క్ ప్యాటర్న్ అంటారు.

**కన్ఫర్మ్ షేమింగ్**

బ్యాంకులు తమ లాభాల కోసం కస్టమర్లను మానసికంగా ఇబ్బంది పెట్టి బలవంతంగా ఆఫర్లను ఓకే చేయించే 'కన్ఫర్మ్ షేమింగ్' ట్రిక్‌ను ఆర్‌బీఐ పూర్తిగా నిషేధించింది. ఇమెయిల్స్ వద్దనుకున్నా, సెక్యూరిటీ లేదా ప్రీమియం అప్‌గ్రేడ్‌లను తిరస్కరించినా.. 'నాకు ఆఫర్లు వద్దు, నేను నష్టపోవడానికే ఇష్టపడతాను' లేదా 'నా అకౌంట్‌కు సెక్యూరిటీ వద్దు' అంటూ కస్టమర్లలో అపరాధ భావన, భయం కలిగించేలా ఆప్షన్లు ఇకపై చెల్లవు. కొత్త రూల్ ప్రకారం, కస్టమర్ ఒక సర్వీస్ వద్దు అనుకుంటే ఆ బటన్ మీద ఎలాంటి సైకలాజికల్ గేమ్స్ లేకుండా సూటిగా 'వద్దు' లేదా 'డిక్లైన్ ' అని మాత్రమే ఉండాలి.హోమ్ స్క్రీన్‌పై వచ్చే లోన్ యాడ్స్ పాప్‌అప్‌లను క్లిక్ చేస్తే తప్ప హోమ్ పేజీకి వెళ్లకుండా ఇబ్బంది పెట్టడం, లేదా అవసరం లేకపోయినా కాంటాక్ట్స్, కెమెరా యాక్సెస్ అడగడం నిషేధం.




### ఫాల్స్ అర్జెన్సీ

'ఆఫర్ గడువు ముగుస్తుంది, వడ్డీ రేట్లు పెరిగిపోతాయి' అంటూ కృత్రిమ కౌంట్‌డౌన్ టైమర్లతో కస్టమర్లను కంగారు పెట్టి లోన్లు తీసుకునేలా ఒత్తిడి చేయకూడదు. ఆర్థిక నిర్ణయాలు తొందరపాటుతో కాకుండా, పూర్తి సమాచారంతో తీసుకోవాలని ఆర్‌బీఐ సూచిస్తోంది.కస్టమర్ అడగకుండానే లోన్ అప్లికేషన్ చివరలో ఇన్సూరెన్స్ లేదా అదనపు ఛార్జీల బాక్స్‌లను డిఫాల్ట్‌గా 'టిక్' చేసి ఉంచడం ఇకపై కుదరదు.

### సబ్‌స్క్రిప్షన్ ఉచ్చు

క్రెడిట్ కార్డ్ లేదా ఇన్సూరెన్స్ కోసం సైన్ అప్ చేయడం ఎంత సులభమో, దాన్ని క్యాన్సిల్ చేయడం కూడా అంతే సులభంగా ఉండాలి. క్యాన్సిలేషన్ ఆప్షన్ విషయంలో లేనిపోని క్లిక్స్ ఉండకూడదు.

ఇంటర్‌ఫేస్ జోక్యం

బ్యాంకుకు లాభం వచ్చే ఆప్షన్‌ను (ఉదాహరణకు: యాక్సెప్ట్ ఆల్) పెద్దగా ఆకుపచ్చ రంగులో చూపిస్తూ, కస్టమర్ వద్దనుకునే ఆప్షన్‌ను (డిక్లైన్) చిన్నగా, బూడిద రంగులో దాచడం లాంటి రూల్స్ ఉల్లంఘనే అవుతుంది.

**బైట్ అండ్ స్విచ్(ఎర వేసి మోసం చేయడం)**

యాడ్‌లో తక్కువ వడ్డీ రేటు లేదా 'లైఫ్‌టైమ్ ఫ్రీ క్రెడిట్ కార్డ్' అని ఆశ చూపి, తీరా అప్లై చేశాక కండిషన్స్ అప్లై అంటూ ఎక్కువ వడ్డీ లేదా హిడెన్ ఛార్జీలు వసూలు చేయకూడదు.

**డ్రిప్ ప్రైసింగ్**

లోన్ ప్రాసెస్ అంతా అయిపోయాక, చివరి చెక్‌అవుట్ స్టేజ్‌లో అప్పటివరకు చెప్పని సర్వీస్ ఛార్జీలు, కొత్త ప్రాసెసింగ్ ఫీజులను దొంగచాటుగా యాడ్ చేయడాన్ని ఆర్‌బీఐ బ్యాన్ చేసింది.

**మోసపూరిత యాడ్స్**

మీ అకౌంట్లో ఏదో అర్జెంట్ సమస్య ఉన్నట్లు పుష్ నోటిఫికేషన్ పంపి, దాన్ని క్లిక్ చేస్తే పర్సనల్ లోన్ యాడ్ చూపించే జిమ్మిక్కులు ఇకపై చెల్లవు.

వేధించడం

ఒక ఆఫర్ లేదా అదనపు ఫీచర్ కస్టమర్ వద్దని ఒకసారి తిరస్కరించిన తర్వాత, యాప్ ఓపెన్ చేసిన ప్రతిసారీ అదే ఆప్షన్‌ను పదేపదే చూపిస్తూ విసిగించకూడదు.

**మోసపూరిత భాష**

'మీరు ఆఫర్లు వద్దనుకోకపోతే ఈ బాక్స్ అన్‌చెక్ చేయండి' వంటి కన్ఫ్యూజ్ చేసే డబుల్ నెగెటివ్ భాషను వాడకూడదు. భాష స్పష్టంగా, సూటిగా ఉండాలి.

### బ్యాంకులు ఏమి చేయాలి?

ఆర్‌బీఐ ఆదేశాల ప్రకారం, అన్ని బ్యాంకులు తమ వెబ్‌సైట్లు, మొబైల్ యాప్‌లు, డిజిటల్ ప్రక్రియలను సమీక్షించాలి. డార్క్ ప్యాటర్న్స్ ఉన్నాయా లేదా అన్నదానిపై ఎప్పటికప్పుడు ఆడిట్‌లు నిర్వహించాలి. అలాగే, సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ (సీసీపీఏ) జారీ చేసిన 2023 డార్క్ ప్యాటర్న్స్ మార్గదర్శకాలను కూడా పాటించాలి.

### నిబంధనలు ఉల్లంఘిస్తే?

2027, జనవరి 1 తర్వాత కూడా మీ బ్యాంకు ఇలాంటి పద్ధతులు కొనసాగిస్తే, ముందుగా బ్యాంక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ అధికారికి ఫిర్యాదు చేయవచ్చు. పరిష్కారం లభించకపోతే ఆర్‌బీఐ అంబుడ్స్‌మన్‌ను ఆశ్రయించవచ్చు.

డిజిటల్ బ్యాంకింగ్ వేగంగా పెరుగుతున్న ఈ కాలంలో, వినియోగదారుల నిర్ణయాలను ప్రభావితం చేసే డిజైన్ ఎత్తుగడలపై ఆర్‌బీఐ మొదటిసారి స్పష్టమైన గీత గీసింది. ఈ కొత్త నిబంధనలు అమల్లోకి వస్తే, బ్యాంకింగ్ యాప్‌లు మరింత పారదర్శకంగా, వినియోగదారులకు అనుకూలంగా మారే అవకాశం ఉంది.

# వాహనాలకు ఎల్‌నినో దెబ్బ



దేశవ్యాప్తంగా నెలకొన్న వర్షాభావ పరిస్థితులు అన్ని రంగాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. రుతుపవనాలు వచ్చినట్టే వచ్చి వెళ్లిపోవడంతో ఇప్పటి వరకు దేశీయంగా ఆశించిన స్థాయిలో వర్షాలు కురియలేదు. ఈ దెబ్బకు దేశీయ ఆటోమొబైల్ రంగంపై తీవ్రస్థాయిలో ప్రతికూల ప్రభావం చూపే అవకాశాలున్నాయని ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనావేస్తున్నది.ప్రధానంగా కార్ల విక్రయాలతోపాటు ద్విచక్ర వాహన అమ్మకాలు సింగిల్ డిజిట్‌కు పరిమితం కానున్నదని వెల్లడించింది. 202627 ఆర్థిక సంవత్సరంలో ద్విచక్ర వాహన విక్రయాలు 3 శాతం నుంచి 5 శాతం వరకు మాత్రమే వృద్ధి నమోదుకావచ్చునని అంచనావేస్తున్నది. పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల కారణంగా చమురు ధరలు భగ్గుమనడం, మరోవైపు వాహన ధరలను ఇబ్బడిముబ్బడిగా పెంచడం కూడా విక్రయాల వేగానికి కళ్లెం వేయనున్నాయని పేర్కొన్నది. మరోవైపు, ఈ ఏడాది కమోడిటీ ఉత్పత్తుల ధరలు భగ్గుమనడం, వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో కొనుగోలుదారులు వేచిచూసే ధోరణి అవలభించే అవకాశాలున్నాయని తెలిపింది. ప్రస్తుతం ద్విచక్ర వాహన ఇండస్ట్రీ ఆశాజనక పనితీరు కనబరుస్తున్నప్పటికీ భవిష్యత్తులో డిమాండ్ పడిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని హెచ్చరించింది. ఈ రంగం పలు సవాళ్లను ఎదుర్కొంటున్నదని, వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, సరఫరా వ్యవస్థ కోసం అధికంగా నిధులు వెచ్చించడంతో వాహన తయారీ సంస్థలపై ప్రతికూల ప్రభావం చూపుతున్నదని పేర్కొన్నది.

ఈవీలకు పెరుగుతున్న డిమాండ్

**ఇంధన ధరలు భగ్గుమనడంతో విద్యుత్తుతో నడిచే వాహనాలకు ఎనలేని డిమాండ్ నెలకొన్నది. మే నెలలో దేశీయంగా 1,72,148 యూనిట్ల ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలు అమ్ముడయ్యాయి. కిందటేడాది ఇదే నెలలో అమ్ముడైన దాంతో పోలిస్తే 71.7 శాతం అధికం. ఒకే నెలలో ఇంతటిస్థాయిలో అమ్ముడవడం ఇదే తొలిసారి. మొత్తం వాహన విక్రయాల్లో ఈవీల వాటా 8.9 శాతానికి పెరిగింది.**




పవన్ కల్యాణ్ కు ఓజీ2 కథ చెప్పిన సుజీత్..

# ఫ్యాన్స్ కు పూనకాలే!

- పవన్ కళ్యాణ్ 'ఓజీ' సీక్వెల్ (ఓజీ2) పనులు ప్రారంభం
- దర్శకుడు సుజీత్, పవన్ మధ్య చర్చలు
- ఇచ్చిన మాట ప్రకారం ఓజీ యూనివర్స్‌పై దృష్టి పెట్టిన పవన్
- పవన్ కళ్యాణ్ క్రియేటివ్ వర్క్స్ నుంచి అధికారిక ప్రకటన
- సోషల్ మీడియాలో ఫ్యాన్స్ సంబరాలు

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఓజీ' సీక్వెల్‌పై కీలక అప్‌డేట్ వచ్చేసింది. ఓజీ2 కోసం ప్రీప్రొడక్షన్ చర్చలు అధికారికంగా ప్రారంభమయ్యాయి. దర్శకుడు సుజీత్... పవన్ కు ఓజీ2 కథ వినిపించారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్ సోషల్ మీడియా ద్వారా ఓ ప్రకటన విడుదల చేసింది. ఇచ్చిన మాట ప్రకారం చర్చలు మొదలయ్యాయని, దర్శకుడు సుజీత్ ... పవన్ తో సమావేశంలో పాల్గొన్నారని వెల్లడించింది.

సుజీత్ దర్శకత్వంలో గ్యాంగ్‌స్టర్ క్రైమ్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కిన 'దే కాల్ హిమ్ ఓజీ' (2025) చిత్రంపై మొదటి నుంచీ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమా విజన్ తనకు ఎంతగానో నచ్చిందని, దీనిని ఒక యూనివర్స్‌గా (సీక్వెల్స్, ప్రీక్వెల్స్) విస్తరించే ఆలోచన ఉందని పవన్ కళ్యాణ్ గతంలో పలు సందర్భాల్లో తెలిపారు. ఇప్పుడు ఆ దిశగా అడుగులు పడుతుండటంతో అభిమానులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.
ప్రస్తుతం క్రియేటివ్ వర్క్స్ కార్యాలయంలో దర్శకుడు సుజీత్, పవన్ మధ్య చర్చలు జరగడం ఓజీ2 ప్రాజెక్ట్‌పై కదలిక మొదలైందనడానికి సంకేతంగా నిలుస్తోంది. ఈ వార్త తెలియగానే పవన్ ఫ్యాన్స్ సోషల్ మీడియాలో సంబరాలు చేసుకుంటున్నారు. ఓజీ2 హ్యాష్‌ట్యాగ్‌తో పోస్టులు, మీమ్స్ ట్రెండ్ అవుతున్నాయి. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి మరిన్ని వివరాలు వెలువడే అవకాశం ఉంది.



# డీగ్లామరైజ్డ్ పాత్రలో ప్రియాంక మోహన్..

ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్‌లో హీరో శింబు- ప్రియాంకా మోహన్ కాంబినేషన్‌లో వచ్చే కొన్ని అత్యంత కీలకమైన రొమాంటిక్ సీన్లు, భావోద్వేగ సన్నివేశాలను డైరెక్టర్ వెట్రిమారన్ ఎంతో వైవిధ్యంగా తెరకెక్కిస్తున్నారని టాక్.
డీగ్లామరైజ్డ్ పాత్రలో ప్రియాంక మోహన్.. కోలీవుడ్ స్టార్ డైరెక్టర్ వెట్రిమారన్-శింబు కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా చిత్రం 'అరసన్'. ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం చెన్నై పరిసర ప్రాంతాలలో శరవేగంగా సాగుతోంది. తాజా సమాచారం ప్రకారం.. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటిస్తున్న టాలెంటెడ్ బ్యూటీ ప్రియాంకా అరుళ్ మోహన్ షూటింగ్‌లో జాయిన్ అయినట్లు సమాచారం. ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. నార్త్ చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ రా అండ్ రియలిస్టిక్ కథలో ప్రియాంకా మోహన్ పాత్రే ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ప్రస్తుతం జరుగుతున్న షెడ్యూల్‌లో హీరో శింబు- ప్రియాంకా మోహన్ కాంబినేషన్‌లో వచ్చే కొన్ని అత్యంత కీలకమైన రొమాంటిక్ సీన్లు, భావోద్వేగ సన్నివేశాలను డైరెక్టర్ వెట్రిమారన్ ఎంతో వైవిధ్యంగా తెరకెక్కిస్తున్నారని టాక్. అయితే వెట్రిమారన్ సినిమాల్లో హీరోయిన్ల పాత్రలు కేవలం గ్లామర్‌కే పరిమితం కాకుండా.. కథను మలుపు తిప్పేలా బలమైన పాత్రలుగా ఉంటాయనే సంగతి తెలిసిందే. ఈ చిత్రంలో కూడా ప్రియాంకా మోహన్ ఒక విభిన్నమైన, డీగ్లామరైజ్డ్, పవర్‌ఫుల్ పాత్రలో నటిస్తున్నట్లు టాక్. తన సహజసిద్ధమైన నటనతో మెప్పించే ప్రియాంకకు, ఈ చిత్రం తన కెరీర్‌లోనే ఒక మైలురాయిగా నిలిచిపోనుందని అభిమానులు భావిస్తున్నారు. కాగా.. ఈ భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో శింబు, ప్రియాంకలతో పాటు విజయ్ సేతుపతి, సముద్రఖని కీలక పాత్రలో నటిస్తున్నారు. కలైపులి ఎస్. థాను నిర్మిస్తున్న ఈ చిత్రానికి రాక్‌స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నారు.



# అతడితో జాన్వీ కపూర్ పెళ్లి ఫిక్సా.. ఒక్క ఫొటోతో ప్రేమను కన్ఫర్మ్ చేసిన యంగ్ బ్యూటీ!

"నేను ఎక్కడైనా తప్పిపోతే, దయచేసి నన్ను శిఖర్ పహారియాకు అప్పగించండి" అని ఉండటం విశేషం. అతడితో జాన్వీ కపూర్ పెళ్లి ఫిక్సా.. ఒక్క ఫొటోతో ప్రేమను కన్ఫర్మ్ చేసిన యంగ్ బ్యూటీ! బాలీవుడ్ యంగ్ హీరోయిన్ జాన్వీ కపూర్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలు నిత్యం ఏదో ఒకటి సోషల్ మీడియాలో వైరల్ అవుతూనే ఉంటాయి. అయితే గత కొద్ది కాలంగా ఆమె శిఖర్ పహారియాతో ప్రేమలో ఉన్నట్లు పుకార్లు షికారు చేస్తున్న విషయం తెలిసిందే. వారు కలిసి బయట కనిపించినా లేదా సోషల్ మీడియాలో ఒకరి పోస్టులపై ఒకరు స్పందించినా అభిమానుల్లో ఎప్పుడూ ఆసక్తి నెలకొంటుంది. నిత్యం వీరిద్దరు పలు ప్రాంతాల్లో తిరుగుతూ అందరి దృష్టిని ఆకర్షిస్తుంటారు. వీరి ప్రేమ వార్తలు ఎన్ని వచ్చినప్పటికీ అధికారికంగా మాత్రం స్పందించలేదు. ఇదిలా ఉంటే.. తాజాగా, జాన్వీ కపూర్ ధరించిన ఒక విభిన్నమైన నైట్‌సూట్ ఫోటో ఇప్పుడు ఇంటర్నెట్‌లో చర్చనీయాంశంగా మారింది. ఆ దుస్తులపై ఉన్న ఒక సరదా మెసేజ్, శిఖర్ పట్ల ఆమెకున్న ప్రేమను వ్యక్తపరుస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఇందులో ఆమె పింక్ కలర్ నైట్‌సూట్‌తో పాటు గ్రే కలర్ జాకెట్ ధరించి కనిపించారు. అయితే, ఆ నైట్‌సూట్‌పై రాసి ఉన్న ప్రత్యేకమైన టెక్స్ట్ అందరినీ ఆశ్చర్యపరిచింది. దానిపై "నేను ఎక్కడైనా తప్పిపోతే, దయచేసి నన్ను శిఖర్ పహారియాకు అప్పగించండి" అనిఉండటం విశేషం. ఇక ఈ క్రేజీ అండ్ క్యూట్ పోస్ట్ సోషల్ మీడియాలోకి వచ్చిన కొద్దిసేపటికే వైరల్‌గా మారింది. దీనిని చూసిన అభిమానులు రిలేషన్‌షిప్ గోల్స్ అంటూ కామెంట్లు పెడుతున్నారు. అంతేకాకుండా వీరిద్దరు పెళ్లి చేసుకోవడం ఖాయమని అనుకుంటున్నారు. అయితే జాన్వీ అలా చేయడం ఇదే మొదటి సారి కాదు.. ఆమె గతంలో కూడా శిఖర్ పేరు ఉన్న నెక్లెస్‌ను ధరించి కనిపించిన సంగతి తెలిసిందే.



# కరుప్పు..

## విజయ్ కథ వినడంతోనే మొదలైంది: ఆర్జే బాలాజీ

నటుడు సూర్యహీరోగా ఆర్జే బాలాజీ తెరకెక్కించిన యాక్షన్ మూవీ 'కరుప్పు'. తెలుగులో 'వీరభద్రుడు'గా విడుదలైంది. 2026 మే 15న థియేటర్లలోకి వచ్చి బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధించింది. ఈ సినిమా విజయంలో నటుడు, తమిళనాడు సీఎం దళపతి విజయ్ పాత్ర ఉందని ఇటీవల దర్శకుడు చెప్పడంతో అభిమానుల్లో చర్చ మొదలైంది. తాజాగా ఆయన దీనిపై క్లారిటీ ఇచ్చారు.
ఇటీవల జరిగిన ఓ ఇంటర్వ్యూలో బాలాజీ మాట్లాడుతూ.. ''విజయ్ సర్ వల్లే ఈ మూవీ సూర్యగారితో చేసే అవకాశం నాకు వచ్చింది. తొలుత ఈ కథను విజయ్‌కు చెప్పాను. కొన్నికారణాల వల్ల ఈ ప్రాజెక్ట్ ముందుకు సాగలేదు. సూర్యలాంటి పెద్ద స్టార్ వద్దకు నేరుగా వెళ్లి కథ చెప్పడమన్నది అంత త్వరగా అయ్యే పని కాదు. ఒకరోజు డ్రీమ్ వారియర్ పిక్చర్స్ వాళ్లు నాకు ఫోన్ చేసి.. 'విజయ్‌కి చెప్పిన కథను సూర్యకి చెబుతారా' అని అడిగారు. దాంతో నేను సూర్యను కలిశా. నేను, విజయ్ కలిసి సినిమా చేయకపోయినా, నా గుండెల్లో ఆయనకు ప్రత్యేక స్థానం ఉంటుంది. ఈరోజు నేను ఈ స్థితిలో ఉండటానికి కారణం సూర్య. కానీ ఈ విషయానికి తలుపు తెరిచింది మాత్రం విజయ్. స్క్రిప్ట్ బాగుందని విజయ్ మా ఆవిడకు కూడా చెప్పారు' అని బాలాజీ తెలిపారు.
విజయ్‌తో సినిమా చేయాల్సి ఉన్నా షెడ్యూల్ సమస్యల వల్ల కుదరలేదని కూడా ఆయన వెల్లడించారు. ఇటీవలే 'కరుప్పు' విజయం తర్వాత, ఆ సినిమా ప్రయాణం విజయ్ కథ వినడంతోనే మొదలైందని బాలాజీ సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. ఈ సినిమాలో సూర్యతో పాటు త్రిష, ఆర్జే బాలాజీ, ఇంద్రాన్స్, అనఘ మాయ రవి, నటరాజన్ సుబ్రమణ్యం, శ్వాసిక, శివద తదితరులు కీలక పాత్రల్లో నటించారు. ఈ మూవీ ప్రస్తుతం అమెజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమ్ అవుతోంది.



# హనుమాన్ 3D అద్భుతం..

## మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తోంది: సాయి దుర్గా తేజ్

**ఈ ఏడాది బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'హనుమాన్' జూన్ 25న 3Dలో విడుదల**
**3D ట్రైలర్ లాంచ్ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన సాయి ధరమ్ తేజ్**
**హనుమాన్ చివరి 20 నిమిషాలు అద్భుతమని కొనియాడిన సుప్రీం హీరో**
**3Dలో సినిమా చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నానన్న హీరో తేజ సజ్జ**
**ప్రేక్షకులకు కొత్త అనుభూతిని ఇవ్వాలనే 3Dలో తీసుకొస్తున్నామన్న నిర్మాతలు**

సూపర్ హీరో తేజ సజ్జ, క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కాంబినేషన్‌లో ఈ ఏడాది విడుదలై సంచలన విజయం సాధించిన చిత్రం 'హనుమాన్'. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై కె. నిరంజన్ రెడ్డి నిర్మించిన ఈ పాన్ ఇండియా బ్లాక్‌బస్టర్, ఇప్పుడు సరికొత్త 3D అనుభూతిని పంచేందుకు సిద్ధమైంది. జూన్ 25న ప్రపంచవ్యాప్తంగా 3Dలో విడుదల కానున్న నేపథ్యంలో, చిత్ర బృందం హైదరాబాద్‌లో 3D ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్ ముఖ్య అతిథిగా హాజరై సందడి చేశారు.
ఈ సందర్భంగా సాయి దుర్గా తేజ్ మాట్లాడుతూ, "హనుమాన్ 3D ట్రైలర్ అద్భుతంగా ఉంది. తెలుగు ప్రేక్షకులకు కొత్త టెక్నాలజీతో మంచి సినిమా అందించాలనే నిర్మాతలు నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డిల ప్యాషన్‌ను అభినందిస్తున్నాను. ఈ సినిమాలో చివరి 20 నిమిషాలు నాకు మళ్లీ మళ్లీ చూడాలనిపిస్తుంది. హనుమంతుడిని ప్రత్యక్షంగా చూసిన అనుభూతి కలుగుతుంది. జూన్ 25న అందరూ కుటుంబ సమేతంగా థియేటర్లకు వచ్చి ఈ అద్భుతమైన అనుభూతిని పొందండి" అని కోరారు.
హీరో తేజ సజ్జ మాట్లాడుతూ, "నేను కూడా మీతో పాటే మొదటిసారి 3D ట్రైలర్ చూశాను. చాలా అద్భుతంగా ఉంది. ఈ సినిమా కోసం నిర్మాతలు పడిన కష్టం తెరపై కనిపిస్తోంది. మీ అందరిలాగే నేను కూడా 3Dలో సినిమాను మళ్లీ థియేటర్లలో చూసేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. ఎంతో పుణ్యం చేసుకుంటే గానీ ఇలాంటి సినిమాలో నటించే అవకాశం రాదు. ప్రేక్షకులు చూపించిన ప్రేమాభిమానాలకు నా కృతజ్ఞతలు" అని అన్నారు. ఈ టీమ్‌ను మళ్లీ కలవడం ఒక రీయూనియన్‌లా ఉందని సంతోషం వ్యక్తం చేశారు.
నిర్మాత నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, "2Dలో 'హనుమాన్' చిత్రాన్ని ఆదరించినట్లే, 3Dలో కూడా ఆస్వాదిస్తారని ఆశిస్తున్నాను" అని తెలిపారు. మరో నిర్మాత చైతన్య రెడ్డి, "ప్రేక్షకుల ఆదరణకు ప్రతిగా ఏదైనా ఇవ్వాలనే ఆలోచనతోనే ఈ సినిమాను 3Dలోకి మార్చాం. అత్యాధునిక టెక్నాలజీతో సిద్ధం చేసిన ఈ వెర్షన్ గొప్ప అనుభూతినిస్తుంది" అని వివరించారు.
దాదాపు 600 మంది టెక్నీషియన్లు మూడు నెలల పాటు శ్రమించి 3D వెర్షన్‌ను సిద్ధం చేశారని 3D కిరణ్ తెలిపారు. హీరోయిన్ అమృత అయ్యర్, సంగీత దర్శకుడు గౌర హరి కూడా ఈ కార్యక్రమంలో పాల్గొని, 3Dలో సినిమా చూడటం ఒక గొప్ప అనుభవంగా ఉంటుందని, జూన్ 25 కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నామని పేర్కొన్నారు.

# నేషన్స్ కప్ హాకీ విజేత భారత్

ఆక్లాండ్: ఎఫ్ఐహెచ్ మహిళల నేషన్స్ కప్ టోర్నమెంట్‌లో భారత మహిళల హాకీ జట్టు రెండోసారి విజేతగా నిలిచింది. ఆదివారం జరిగిన ఫైనల్ పోరులో 20 గోల్స్ తేడాతో ఆతిథ్య న్యూజిలాండ్ జట్టును చిత్తు చేసింది. టోర్నీలో అజేయంగా నిలిచిన సలిమా టెటె నేతృత్వంలోని భారత జట్టు.. ఫైనల్లోనూ అదే జోరును కొనసాగించింది.ఈ విజయంతో వచ్చే సీజన్ ఎఫ్ఐహెచ్ హాకీ మహిళల ప్రో లీగ్ లో ఆడేందుకు అర్హత సాధించింది. మ్యాచ్ ప్రారంభమైన 4వ నిమిషంలో లభించిన పెనాల్టీ కార్నర్‌ను నవ్‌నీత్ కౌర్ పవర్‌ఫుల్ హిట్‌తో గోల్‌గా మలిచి జట్టుకు 10 ఆధిక్యాన్ని అందించింది.మ్యాచ్ 15వ నిమిషంలో సునేలిత గోల్‌తో భారత్ విజయం ఖరారైంది.




# వైభవ్ వీరవిహారం.. విమర్శలకు గట్టి కౌంటర్



**ఐపీఎల్‌లో సంచలనంగా వెలుగులోకి వచ్చిన 15 ఏళ్ల యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ, తనపై వచ్చిన విమర్శలకు బ్యాట్‌తోనే గట్టి సమాధానం ఇచ్చాడు. 'ఒత్తిడి లేదు.. ప్రణాళికలు అమలు చేశానంతే!' విమర్శకులకు బ్యాట్‌తోనే బదులిచ్చిన వైభవ్ సూర్యవంశీ**

ఐపీఎల్‌లో సంచలనంగా వెలుగులోకి వచ్చిన 15 ఏళ్ల యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ, తనపై వచ్చిన విమర్శలకు బ్యాట్‌తోనే గట్టి సమాధానం ఇచ్చాడు. ముక్కోణపు సిరీస్ తొలి మూడు మ్యాచ్‌ల్లో ఆశించిన స్థాయిలో రాణించకపోవడం, శ్రీలంక A ప్లేయర్లతో గొడవకు దిగిన వీడియో వైరల్ అవ్వడంతో సోషల్ మీడియాలో ట్రోల్స్ ఎదుర్కొన్న వైభవ్, ఆదివారం శ్రీలంక 'ఏ'తో జరిగిన ఫైనల్లో కేవలం 29 బంతుల్లో 94 పరుగులు (10 ఫోర్లు, 8 సిక్సర్లు) చేసి భారత్ 'ఏ' విజయానికి ప్రధాన కారణమయ్యాడు. ఫైనల్లో తన విధ్వంసకర ఇన్నింగ్స్‌తో విమర్శకుల నోళ్లు మూయించాడు. ఈ ఇన్నింగ్స్‌తో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నాడు.

మ్యాచ్ అనంతరం మాట్లాడిన వైభవ్..

మ్యాచ్ అనంతరం మాట్లాడిన వైభవ్, 'ఎలాంటి ఒత్తిడి అనిపించలేదు. తొలి 10 ఓవర్లను సద్వినియోగం చేసుకోవాలనే లక్ష్యంతో బరిలోకి దిగాను. గత మ్యాచ్‌ల్లో నా ప్రణాళికలను అమలు చేయలేకపోయాను. ఫైనల్‌కు ముందు కోచ్‌లతో మాట్లాడి అదే అమలు చేశాను' అని తెలిపాడు. 50 ఓవర్ల ఫార్మాట్‌లో ఇప్పటికే చాలానే మ్యాచ్‌లు ఆడానని, అయితే భిన్నమైన పిచ్‌లు, పరిస్థితుల్లో ఆడటం మంచి అనుభవంగా నిలిచిందని పేర్కొన్నాడు.

66 పరుగుల తేడాతో ఘన విజయం..

దంబుల్లా వేదికగా జరిగిన ఈ ఫైనల్ పోరులో భారత్ 'ఏ' 66 పరుగుల తేడాతో శ్రీలంక 'ఏ'ను చిత్తు చేసి టైటిల్ ఎగరేసుకుపోయింది. సూర్యవంశీ వీర విహారానికి తోడు కెప్టెన్ తిలక్ వర్మ (90 బంతుల్లో 67), అనుకుల్ రాయ్ (15 బంతుల్లో 39) రాణించడంతో భారత్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 377 పరుగుల భారీ స్కోరు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనలో శ్రీలంక 47.1 ఓవర్లలో 311 పరుగులకే కుప్పకూలింది.

అద్భుతంగా పుంజుకున్నాం: కెప్టెన్ తిలక్ వర్మ

టోర్నీలో తమ ప్రయాణంపై కెప్టెన్ తిలక్ వర్మ హర్షం వ్యక్తం చేశాడు. అఫ్గానిస్తాన్, శ్రీలంక (సూపర్ ఓవర్) చేతిలో లీగ్ దశలో ఓడిపోయినప్పటికీ.. జట్టు అత్యుత్తమ క్యారెక్టర్ చూపెట్టి అద్భుతంగా పుంజుకుందని తెలిపాడు. ఫైనల్లో బ్యాటింగ్ అద్భుతంగా ఉన్నా బౌలింగ్ కాస్త నిరాశపరిచిందని, అయితే అంతిమంగా ట్రోఫీ గెలవడం ముఖ్యమని తిలక్ పేర్కొన్నాడు.

# భారత్‌కు తొలి ఓటమి.. సౌతాఫ్రికా ఘన విజయం

- శ్రీచరణి పోరాటం వృథా.. భారత్ ఓటమి
- వరుస విజయాలకు బ్రేక్.. భారత్‌పై సౌతాఫ్రికా గెలుపు
- మారిజన్ కాప్ మేజిక్.. సౌతాఫ్రికా సూపర్ విక్టరీ
- 159 లక్ష్యాన్ని ఛేదించిన సౌతాఫ్రికా





మహిళల టీ20 వరల్డ్ కప్‌లో భారత జట్టుకు తొలి ఓటమి ఎదురైంది. ఆదివారం మాంచెస్టర్‌లో జరిగిన గ్రూప్‌ఏ ఉత్కంఠభరిత పోరులో సౌతాఫ్రికా మహిళల జట్టు 6 వికెట్ల తేడాతో భారత్‌పై ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో సౌతాఫ్రికా తన ప్రపంచకప్ ప్రచారంలో ఆశలు సజీవంగా ఉంచుకోగా, టోర్నీలో వరుస విజయాలతో దూసుకుపోతున్న భారత్‌కు బ్రేక్ పడింది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ ఎంచుకున్న భారత జట్టు నిర్ణీత ఓవర్లలో 158 పరుగులు చేసింది. ఓపెనర్లు స్మృతి మంధాన (17), షెఫాలీ వర్మ ఆరంభంలో ధాటిగా ఆడినప్పటికీ.. సౌతాఫ్రికా బౌలర్లు కట్టడి చేయడంతో మిడిల్ ఓవర్లలో భారత్ వరుస వికెట్లు కోల్పోయింది. తన కెరీర్‌లో చారిత్రాత్మక 200వ టీ20 మ్యాచ్ ఆడుతున్న భారత కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ 24 పరుగులు చేయగా, దీప్తి శర్మ 29 పరుగులతో రాణించింది. సౌతాఫ్రికా బౌలర్లలో షబ్నిమ్ ఇస్మాయిల్, మారిజన్ కాప్ చెరో 2 వికెట్లు పడగొట్టారు.అనంతరం 159 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికాకు భారత యువ బౌలర్ శ్రీచరణి (3 వికెట్లు) ఆరంభంలోనే రెండు షాక్‌లు ఇచ్చింది. అయితే, ఆ తర్వాత సౌతాఫ్రికా స్టార్ బ్యాటర్ మారిజన్ కాప్ (45 బంతుల్లో 81 నాటౌట్) విధ్వంసకర బ్యాటింగ్‌తో చెలరేగింది. ఆమెకు తోడుగా తజ్మిన్ బ్రిట్స్ (40) రాణించడంతో మూడో వికెట్‌కు 97 పరుగుల కీలక భాగస్వామ్యం నమోదైంది. చివరికి క్లో ట్రయాన్ బౌండరీతో సౌతాఫ్రికా విజయాన్ని ఖరారు చేసింది. ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టిన మారిజన్ కాప్ సౌతాఫ్రికా విజయంలో కీలక పాత్ర పోషించింది.




# అట్టహాసంగా ప్రారంభమైన టీజీ20 లీగ్ ఆరంభ వేడుకలు..




**తెలంగాణలో యువ క్రికెటర్ల ప్రతిభను వెలుగులోకి తీసుకురావడం.. వారిని ఐపీఎల్, టీమ్‌ఇండియా వైపు నడిపించడమే లక్ష్యంగా హైదరాబాద్ క్రికెట్ సంఘం (హెచ్‌సీఏ) ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న టీజీ20 లీగ్ తొలి సీజన్ ఆరంభ వేడుకలు ప్రారంభమయ్యాయి. ఉప్పల్ స్టేడియంలో జరుగుతున్న ఈ వేడుకలకు తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క హాజరయ్యారు. టీజీ20 బ్రాండ్ అంబాసిడర్ విజయ్ దేవరకొండ, మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.**

**హెచ్‌సీఏ ప్రతినిధులు, లీగ్‌లో భాగమైన ఎనిమిది ఫ్రాంచైజీల కెప్టెన్లు, ఆటగాళ్లు, సెలబ్రేషన్స్‌లో పాల్గొన్నారు. మ్యూజిక్ డైరెక్టర్ తమన్ ప్రత్యేక ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. తెలంగాణ సంస్కృతి ఉట్టిపడేలా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అనంతరం లేజర్ షో, క్రాకర్స్ షో ఉంటాయి. ప్రారంభోత్సవం తర్వాత 7.15కి పాలమూరు స్ట్రైకర్స్, అన్విత ఖమ్మం ఏసెస్ మధ్య తొలి మ్యాచ్ మొదలుకానుంది.**

# 3 మ్యాచ్‌ల్లో వంద గోల్స్.. ఆల్‌టైమ్ రికార్డు ఎంతో తెలుసా?



ప్రపంచవ్యాప్తంగా ప్రస్తుతం ఫిఫా క్రేజ్ నడుస్తోంది. ఏ దేశం చూసినా ఫుట్‌బాల్ మత్తులోనే తేలియాడుతోంది. గోల్స్ వర్షంలో అభిమానులు తడిసి ముద్దవుతున్న వేళ ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీ కొత్త చరిత్ర సృష్టించింది. ఫిఫా చరిత్రలో 68 ఏళ్ల తర్వాత అత్యంత వేగంగా 100 గోల్స్ నమోదైన ఎడిషన్‌గా 2026 ఫిఫా టోర్నీ నిలిచింది. 1958 ఫిఫా ప్రపంచకప్‌లో 32 లేదా 33 మ్యాచ్‌ల్లో వంద గోల్స్ నమోదైనట్లు రికార్డుల్లో ఉంది.ఈసారి ఫిఫా ప్రపంచకప్‌లో 33 మ్యాచ్‌ల్లోనే 100 గోల్స్ మైలురాయిని చేరుకోవడం విశేషం. కాగా ప్రపంచకప్‌లో ఈసారి తొలి గోల్‌ను సౌతాఫ్రికాతో మ్యాచ్‌లో మెక్సికో ఆటగాడు జూలియన్ క్వినోనెస్ నమోదు చేయగా.. వందో గోల్‌ను నెదర్లాండ్స్ స్టార్ ఆటగాడు కోడీ గాకో కొట్టాడు. స్వీడన్‌తో మ్యాచ్‌లో కోడీ గోల్ కొట్టడం ద్వారా టోర్నీలో వందో గోల్ వచ్చింది. ఈ మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 51 తేడాతో స్వీడన్‌ను చిత్తు చేసింది. కాగా ఫిఫా చరిత్రలో 33 మ్యాచ్‌ల్లో వంద గోల్స్ చేరుకోవడమనేది సరికొత్త రికార్డుగా పేర్కొనవచ్చు. గతంలో 1982, 2014 ప్రపంచకప్పుల్లో వంద గోల్స్ చేరడానికి 36 మ్యాచ్‌లు, 1978, 1994 టోర్నీల్లో 38 మ్యాచ్‌లు అవసరమయ్యాయి.

అయితే 1954లో స్విట్జర్లాండ్ వేదికగా జరిగిన ఫిఫా ప్రపంచకప్‌లో మాత్రం కేవలం 20 మ్యాచ్‌ల్లోనే 100 గోల్స్ నమోదవ్వడం ఇప్పటికీ ఆల్‌టైమ్ రికార్డుగా ఉంది. ఈ రికార్డును అందుకోవడం ఇప్పట్లో కష్టతరమే. అంతేకాదు నెదర్లాండ్స్ జట్టు కూడా మరో అరుదైన ఘనత సాధించింది. ఫిఫా ప్రపంచకప్ చరిత్రలో 100 గోల్స్ క్లబ్‌లో చేరిన ఎనిమిదో దేశంగా నెదర్లాండ్స్ నిలిచింది. స్వీడన్‌తో మ్యాచ్‌లో బ్రియాన్ బ్రోబ్బే రెండు గోల్స్ సాధించగా.. అతని రెండో గోల్ నెదర్లాండ్‌కు ఫిఫా ప్రపంచకప్లలో 100వ గోల్‌గా నిలిచిపోయింది. మొత్తం మీద అమెరికా, కెనడా, మెక్సికో సంయుక్తంగా ఆతిథ్యమిస్తోన్న ఫిఫా ప్రపంచకప్ టోర్నీలో 48 దేశాలు పాల్గొంటున్నాయి.

# జైస్వాల్ ఔట్, కోహ్లీ ఇన్..

**ముంబై: ఇంగ్లండ్‌తో మూడు వన్డేల సిరీస్‌కు బీసీసీఐ..భారత క్రికెట్ జట్టును ఆదివారం ప్రకటించింది. అజిత్ అగార్కర్ నేతృత్వంలో సమావేశమైన సీనియర్ సెలెక్షన్ కమిటీ 15 మందితో జట్టును ఎంపిక చేసింది. అఫ్గానిస్థాన్‌తో తాజాగా ముగిసిన వన్డే సిరీస్‌లో ఆకట్టుకున్న యువ ఓపెనర్ యశస్వి జైస్వాల్‌కు చుక్కెదురు కాగా, స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తిరిగి జట్టుకు ఎంపికయ్యాడు. అఫ్గన్‌తో ఆఖరి వన్డేలో ధనాధన్ సెంచరీతో జట్టు విజయంలో కీలకంగా వ్యవహరించిన జైస్వాల్‌కు సెలెక్టర్ల నుంచి మొండిచేయి ఎదురైంది. ఐపీఎల్ సందర్భంగా గాయపడ్డ కోహ్లీ..ఈ వారంలో బెంగళూరు సీవోఈలో ఫిట్‌నెస్ పరీక్షలో పాస్ కావాల్సి ఉంది.వచ్చే ఏడాది జరిగే వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకున్న సెలెక్టర్లు అందుకు తగ్గట్లు కోర్‌టీమ్‌ను ఎంపిక చేశారు. 2023 వన్డే వరల్డ్‌కప్ నుంచి దూరంగా ఉంటున్న సీనియర్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా.. ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు చోటు దక్కించుకున్నాడు. మరోవైపు అక్షర్‌పటేల్ తిరిగి జట్టులోకి రాగా, ఇటీవలే అరంగేట్రం చేసిన ప్రిన్స్‌యాదవ్, హర్ష్‌దూబేకు నిరాశే ఎదురైంది. స్టార్ ఆల్‌రౌండర్ హార్దిక్‌పాండ్యా బెర్తు ఖాయం కాగా, తెలుగు క్రికెటర్ నితీశ్‌కుమార్‌రెడ్డి చోటు నిలుపుకొన్నాడు. జూలై 14, 16, 19 తేదీల్లో భారత్, ఇంగ్లండ్ వన్డే సిరీస్ జరుగనున్నది.**

**జట్టు వివరాలు: గిల్(కెప్టెన్), రోహిత్‌శర్మ, కోహ్లీ (ఫిట్‌నెస్ పరీక్షను అనుసరించి), అయ్యర్(వైస్ కెప్టెన్), రాహుల్, కిషన్, సుందర్, అక్షర్, నితీశ్‌కుమార్, కుల్దీప్, బుమ్రా, ప్రసిద్, రానా, అర్ష్‌దీప్, గుర్నూర్ బ్రార్.**

